



వేదికపై సీఎం చంద్రబాబు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి, నసీర్, కార్పొరేషన్ చైర్మన్లు ఉండవల్లి శ్రీదేవి, పిల్లి మాణిక్యరావు, డేగల ప్రభాకర్ తదితరులు

పేదరిక నిర్మూలనే లక్ష్యం కావాలి

- లక్ష మంది పరిశ్రమలు నెలకొల్పేలా చూడాలి
- దిశ సమావేశంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఆదేశాలు



కలెక్టర్ జె.వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్‌తో కలిసి స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 డాక్యుమెంటరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన లక్ష్యంతో దారిద్ర్యరేఖకు దిగువన ఉండే కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి అధికారులు కృషిచేయాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరికి నాణ్యమైన విద్య అందించాలన్నారు. రానున్న ఐదేళ్లల్లో జిల్లా నుంచి లక్షమంది యువత సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదన్నారు. పది ట్రేడ్లలో నైపుణ్యాలపై యువతకు శిక్షణ ఇచ్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో జిల్లాకు 261 కోట్లు కేటాయిస్తే 186 కోట్ల వినియోగంపై సమీక్షించారు. జగ్జీవన్ జ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ పొందుతున్న 45 వేల ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు సూర్యఘర్ యోజనను వర్తింప చేయాలని తెలిపారు. పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపాలని డీఈవో ఎస్.పురుషోత్తంను ఆదేశించారు. ప్రకాశం బ్యారేజి వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుచేసి జిల్లాలోని 18 మండలాలకు తాగునీరు అందిస్తామన్నారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలకు ఎన్‌ఎస్‌పీ వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తామన్నారు. అద్దంకిలో 50 పడకల సామాజిక వైద్యశాల, కేర్‌సెంటర్ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు.

అధికారులపై ఆగ్రహం..

జిల్లా అధికారుల్లో సమన్వయం లోపించిందని ఎంపీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో 67 పథకాలు నడుస్తుంటే 44 పథకాల వివరాలనే ఇవ్వడంపై అధికారులను ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద మంజూరైన గృహాల్లో 15 వేల నిర్మాణాలు మొదలు కాకపోవడంపై అధికారులను నిలదీశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 డాక్యుమెంటరీని కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ప్రకాశం, గుంటూరు జడ్పీ సీఈవోలు చిరంజీవి, జ్యోతిబసు, రేపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగమ్మ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐ కారు ఢీ.. బాపట్ల ఏఆర్ ఎస్ఐ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

చీరాలటౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చీరాల మండలం ఈపూరుపాలెం ఆటోనగర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని బాపట్ల ఏఆర్ ఎస్ఐ మేడిద సంపూర్ణరావు(56) మృతి చెందారు. పేరాల గాంధీనగర్‌కు చెందిన సంపూర్ణరావు బాపట్ల ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే పేరాల నుంచి ఉదయం విధులకు ద్విచక్ర వాహనంపై బాపట్లకు వస్తున్నారు. అదే సమయంలో బాపట్ల వైపు నుంచి కారు డ్రైవింగ్ చేసుకుంటూ వస్తున్న ప్రకాశం జిల్లా దొనకొండ ఎస్ఐ కె.విజయ్‌కుమార్ ఎదురుగా వస్తున్న ఏఆర్ ఎస్ఐ బైక్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంపూర్ణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. చీరాల డీఎస్పీ ఎండి మొయిన్, ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కారును సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

బిల్డ్ ఏపీతో ముందుకు



గుంటూరులో నరెడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



నరెడ్కో షోలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

- నిర్మాణరంగాన్ని నిలబెట్టేందుకు చర్యలు
- రియల్ ఎస్టేట్ బాగున్న చోటే సంపద సృష్టి
- నరెడ్కో ప్రాపర్టీ షోలో సీఎం చంద్రబాబునాయుడు
- గుంటూరులో రియల్ సందడి.. 12వ ప్రాపర్టీ షో ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, పక్కన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు బిల్డర్స్

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకెళ్తున్నాం. బ్రాండ్ ఏపీ ఇమేజ్‌తో ఇప్పుడిప్పుడే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలి. వ్యవసాయం లాభసాటి కావాలి. పర్యాటకం ఊపందుకోవాలి. సంపద పెరగాలి. అప్పుడే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుంది. ఐదేళ్ల విధ్వంస పాలనలో పడకేసిన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాలన్న ధ్యేయంతో ఉన్నాం. అందుకే నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభ కార్యక్రమానికి వచ్చాను..' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శుక్రవారం గుంటూరు స్తంభాలగరువులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నేషనల్ రియల్ ఎస్టేట్ కౌన్సిల్(నరెడ్కో), క్యాపిటల్ జోన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 12వ ప్రాపర్టీ షోను సీఎం చంద్రబాబు మంత్రి నారాయణతో కలిసి ప్రారంభించారు. తొలుత స్టాల్స్‌ను పరిశీలించి నూతన సాంకేతిక పరిజ్ఞానం గురించి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 'గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటు చూసినా విధ్వంసం.. రాష్ట్రమంతా అంధకారమే. ఏడు నెలల క్రితం వరకూ నిర్వీర్యమైన రాష్ట్రాన్ని చూశాం. నిర్మాణరంగమైతే ఐదేళ్లు అడ్రస్ లేకుండా పోయింది. కూల్చివేతలతో భయభ్రాంతులకు గురిచేయడంతో ఈ రంగం పూర్తిగా దెబ్బతింది. రాష్ట్రంలో నిర్మాణ రంగానికి మళ్లీ ఊపు రావాలని కోరుకుంటున్నాను. నిర్మాణం రంగాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చేవారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. నిర్మాణ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇచ్చాం. యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కారిస్తాం..' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.



ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ

గతాన్ని మర్చిపోయి.. పరుగెత్తాలి

నిర్మాణ రంగంలో మన రాష్ట్రాన్ని మించిన పాలసీ ఉండదని ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే వీలైనన్ని నిబంధనలు సరళతరం చేశామన్నారు. ఇప్పటిదాకా నిదానించిన నిర్మాణరంగాన్ని నిలబెడుతున్నామన్నారు. గతాన్ని మర్చిపోవాలని, నడవాలి.. పరుగెత్తాలని సూచించారు. నిర్మాణ రంగంలోనూ వచ్చిన నూతన ఆవిష్కరణలను ఉపయోగించుకుంటే రూ.500 సంపాదించేవాళ్లు రూ.1,500 సంపాదించవచ్చన్నారు. గత ఐదేళ్లు ఇసుక లభించక భవన నిర్మాణ రంగం కార్మికులకు సరైన ఉపాధి ఉండేది కాదని కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. నాగరిక సమాజంలో నిర్మాణం అనేది నిత్యం జరుగుతూనే ఉంటుందన్నారు.

రూ.50 వేల కోట్లతో అమరావతి పనులు

అమరావతి పనులను రూ.50 వేల కోట్లతో ప్రారంభిస్తామని సీఎం చెప్పారు. దేశంలో అమరావతి లాంటి నగరం మరొకటి రాదన్నారు. కొత్త నగరాన్ని బెస్ట్ మోడల్ సిటీగా నిర్మిస్తామని చెప్పారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు కన్నా పెద్దగా అమరావతి చుట్టూ 183 కిలోమీటర్ల మేర రింగ్ రోడ్డుకు ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అది పూర్తయితే గుంటూరు-అమరావతి కలిసిపోతుందన్నారు. ఐటీని అందిపుచ్చుకుని విదేశాలకు వెళ్లిన వారిలో గుంటూరువాసులు ఎక్కువన్నారు. ఇతర దేశాల్లో మాదిరి రాష్ట్రంలోనూ స్వచ్ఛమైన వాతావరణాన్ని సృష్టిస్తామని తెలిపారు. గుంటూరులో ఏర్పాటు చేసిన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ బ్రహ్మాండంగా పని చేస్తోందన్నారు.



సభకు హాజరైన బిల్డర్స్

అనుమతులు ఇక సరళతరం : మంత్రి నారాయణ

నేషనల్ బిల్డింగ్ కోడ్ సలహాలు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మోడల్ బిల్డింగ్ బైలాస్‌కు అనుగుణంగా నిర్మాణ రంగంలో అనుమతుల నిబంధనలు సరళతరం చేస్తూ శుక్రవారం పురపాలక శాఖ జీవో జారీ చేసిందని మంత్రి నారాయణ తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందాలన్నారు. ఈ క్రమంలో ఈ రంగంలోని వారికి ఇబ్బంది లేకుండా చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సూచించారన్నారు.

రాక్షస పాలనలో ఐదేళ్లు : గద్దె తిరుపతిరావు

గత ఐదేళ్లు రాష్ట్రంలో రాక్షస పాలనలో ఉన్నామని ప్రాపర్టీ షో కమిటీ చైర్మన్ గద్దె తిరుపతిరావు తెలిపారు. నిర్మాణ, స్థిరాస్తి రంగాల్లో ఉన్న వారు అప్పులు పాలయ్యారని, చాలామంది రాష్ట్రం విడిచి వెళ్లిపోయారన్నారు. అమరావతి ఉద్యమం ధర్మబద్ధమైనదని అందరూ విశ్వసించినందునే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. తణుకు టీడీఆర్ బాండ్ల విషయంలో 700 మందికి పైగా బిల్డర్లు నష్టపోయారని, వారికి న్యాయం చేయాలన్నారు.

నాణ్యమైన కార్మికులు దొరకడం లేదు: హరిబాబు

రాష్ట్రంలో నాణ్యమైన కార్మికులు లభించక ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని నరెడ్కో చైర్మన్ హరిబాబు తెలిపారు. వారు వాళ్ల రాష్ట్రాల్లో ఖర్చంతా పెడుతున్నారని, అదే స్కిల్ డెవలప్‌మెంట్ ఇక్కడి కార్మికులకు ఇస్తే వారి ఆదాయం మూడు రెట్లు పెరగడంతో పాటు జీడీపీలో వృద్ధి సాధిస్తామన్నారు. ప్రభుత్వం భూమిని ఇస్తే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. జూలైలో మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ఒక సమ్మిట్ నిర్వహిస్తామన్నారు.

ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం..

నరెడ్కో ప్రోపర్టీ షో ప్రారంభోత్సవానికి గుంటూరు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, నసీర్‌అహ్మద్, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయరు సజీలా, నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్, ప్రతినిధులు చుక్కపల్లి రమేష్, ఎస్ఎల్‌వీ రాజు, హీరానందని, మామిడి సీతారామయ్య, నాగవంశీ, శ్రీనాథ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రద్దీగా ఉన్న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్

సంక్రాంతి రద్దీ 8

న్యాయవాదుల ఆందోళన ఉధృతం 6

ఆన్‌లైన్‌లో పందెం కోళ్లు 8



మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు ప్రయోజనం 6

- న్యాయమూర్తుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి

కోట్లు కొల్లగొట్టినా.. చర్యలేవీ..?

- జీడీసీసీబీ సీఈవోపై రాష్ట్ర సహకార శాఖ తీవ్రఆరోపణలు
- ఉద్దేశపూర్వకంగానే మోసాలను దాచారని వెల్లడి
- కొత్త సీఈవో నియామకానికి రంగం సిద్ధం

గుంటూరు సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రూ.60వేల పెన్షన్ సొమ్ముతో పంచాయతీ కార్యదర్శి పారిపోతే అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తక్షణమే సస్పెండ్ చేశారు. మరి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీ)లో కొన్ని వందల కోట్లు దారిమళ్లించిన వారిని ఏమి చేశారో తెలుసా?! కేసు పెట్టలేదు.. సస్పెండ్ చేయలేదు.. చిన్న క్రమశిక్షణ చర్య కూడా తీసుకోలేదు. పైగా ఆ ఉద్యోగి చిన్న ఉద్యోగంలో ఉంటే ప్రమోషన్ ఇచ్చి మరింత పెద్ద పోస్టులో కూర్చోబెట్టారు. అదనంగా జీతభత్యాలు పెంచేశారు. ఇదంతా ఎలా సాధ్యం అయ్యింది అంటే జీడీసీసీబీలో ఉన్న సీఈఓ ఎవరు ఏమి చేసినా చూస్తూ కూర్చోవడంతో అక్రమార్కులు దినదిన ప్రవర్ధమానంగా విలసిల్లారు. బ్యాంకు లో జరుగుతున్న అక్రమాలను అరికట్టడంలో సీఈఓ పూర్తిగా విఫలం అయినట్లు సాక్షాత్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రకటించింది. మోసాలను దాచటంలో (మిగతా 8వ పేజీలో)



నరేంద్ర లేఖతో కదిలిన డొంక..

గత ఐదేళ్ల కాలంలో డీసీసీబీలో ఇబ్బడిముబ్బడిగా జరిగిన అక్రమాల డొంక పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర లేఖతో కదిలింది. ఇక్కడ జరిగిన అక్రమాలపై ఆయన శాసనసభలో మాట్లాడటంతో పాటు, ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాశారు. దానిపై సీరియస్‌గా స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. నరేంద్ర లేఖ ఆధారంగానే ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు కలెక్టర్‌లకు వారి పరిధిలోని డీసీసీ బ్యాంకులలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని లేఖలు రాయటం జరిగింది. అక్కడ కలెక్టర్‌లు చర్యలు చేపట్టే లోపే ప్రభుత్వం సెక్షన్ 51 కింద సమగ్ర విచారణకు ఆదేశించింది.

కొండలా పెరిగిన మొండి బకాయిలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 42 డీసీసీబీ శాఖల్లో కొండలా పెరిగిపోయిన మొండి బాకీలు బ్యాంకు ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చాయి. ఆడిట్ నివేదిక ప్రకారం గుంటూరు జిల్లాలో రూ.225కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.151కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో ఎంత ఉన్నాయనేది లెక్క తేలటం లేదు. అసలు ఈ బకాయిలు ఎవరివి అన్న విషయాన్ని ఇన్నాళ్లు చాలా గోప్యంగా ఉంచుతూ వచ్చారు. సమగ్ర విచారణ తర్వాత వాటి సంగతి తేలే అవకాశం ఉంది.

గోకులం గగ్గోలు

- బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం
- షెడ్ల నిర్మాణంపై అధికారుల హడావుడి
- చెల్లింపులు జరగక లబ్ధిదారులకు ఆర్థిక వెతలు
- ప్రారంభోత్సావాలు సరే.. నగదు ఇవ్వాలంటున్న పాడి రైతులు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.6 కోట్ల బిల్లుల పెండింగ్
- వైసీపీ ప్రభుత్వం మంజూరు చేయని రూ.50 కోట్ల బిల్లుల కోసం ఎదురుచూపులు


(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పాడి పోషకులను ప్రోత్సహించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా పథకాలను ప్రవేశపెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని కొనసాగిస్తూ నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పెద్దఎత్తున మినీ గోకులం నిర్మాణాలను ఉపాధి హామీ నిధులతో అనుసంధానం చేస్తూ మంజూరు చేసింది. దీంతో మూడు జిల్లాల్లో పాడి రైతులు 1846 మినీ గోకులం షెడ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చారు. పాడి రైతుల చేత హడావుడిగా షెడ్ల పనులను ప్రారంభించారు. నిధుల కొరత లేదని, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఉపాధి సిబ్బంది పాడి రైతులు వెంటపడ్డారు. దీంతో లబ్ధిదారులు అప్పులు చేసి మరీ షెడ్లను నిర్మించుకున్నారు. తీరా బిల్లుల చెల్లింపులు చేయాల్సి వచ్చే సరికి తొలుత వెంట పడిన అధికారులు ఇప్పుడు చేతులెత్తేశారు. బిల్లులు మంజూరు కాక లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిల్లులు చెల్లింపుల విషయంలో అదిగో ఇదిగో అంటూ ఉపాధి సిబ్బంది కాలయాపన చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పల్నాడు జిల్లాలో 708, బాపట్ల జిల్లాలో 765, గుంటూరు జిల్లాలో 373 షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. పల్నాడు జిల్లాలో సుమారు 250 పూర్తయినట్లు డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. బాపట్ల జిల్లాలో 185, గుంటూరు జిల్లాలో 170 వరకు పూర్తి చేసినట్లు సమాచారం.

నాటి పరిస్థితులు పునరావృతం..

నిర్మాణాలు పూర్తి అయిన గోకులం షెడ్లను ప్రారంభించేందుకు డ్వామా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యేల చేత వీటిని ప్రారంభిస్తున్నారు. ప్రారంభోత్సావాలు సరే తమ బిల్లుల మాటేమిటని లబ్ధిదారులు అధికారులను నిలదీస్తున్నా వారి నుంచి సరైన సమాధానం ఉండటం లేదు. 2018 - 2019 నాటి పరిస్థితులు పునరావృతం అవుతాయా అన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.6 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు అంచనా. అధిక శాతం రైతులు 4 (మిగతా 8వ పేజీలో)



ఈపూరు మండలంలో పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన గోకులం షెడ్ నిర్మాణం



ఈపూరు మండలంలో గోకులం పథకం కింద నాడు నిర్మించిన షెడ్

సీసీఐ కేంద్రాల్లో క్వింటాకు రూ. 30 వసూలు

● రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్‌కు ఫిర్యాదు

గుంటూరు సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో క్వింటా పత్తికి మార్కెటింగ్ సిబ్బంది రూ.30 వసూలు చేస్తున్నారని తెలుగు స్టేట్స్ కామన్ మ్యాన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గౌరు వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీతను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మార్కెటింగ్‌శాఖకు చెందిన కింది స్థాయి సిబ్బంది రైతుల వద్ద నుంచి ఈ సొమ్మును వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అడిగినంత ఇవ్వని పక్షంలో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. సుమారు రూ. 90 లక్షల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఇందులో అన్ని స్థాయిల అధికారుల పాత్ర ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు, విచారణ సంస్థలకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ఇవికాక మధ్యవర్తులుగా ఉన్న వ్యక్తులు రైతుల వద్ద నుంచి క్వింటాకు రూ. 100 నుంచి రూ.200 వరకు తీసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఈ-క్రాప్ బుకింగ్, ఇతర డాక్యుమెంట్‌ల పేరుతో ఈ వ్యవహారం జరుగుతుందని గౌరు వెంకటేశ్వరరావు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అద్దె మొండి బకాయిలపై జడ్పీ అధికారుల దృష్టి



వినుకొండ పంచాయతీరాజ్ అతిథి గృహంను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో కృష్ణ

గుంటూరు సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పేరుకు పోయిన అద్దె మొండి బకాయిల వసూలుపై జిల్లా పరిషత్ అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ శుక్రవారం పల్నాడు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తొలుత వినుకొండ వెళ్లిన ఆయన అక్కడ ఉన్న జిల్లా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్, అతిథి గృహంను పరిశీలించారు. అక్కడ రూ.2 లక్షల 93 వేల అద్దె బకాయిలను వెంటనే వసూలు చేయించారు. అనంతరం నరసరావుపేటలో ఉన్న జిల్లా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ లో ఎన్నో నెలలుగా పెండింగ్ లో ఉన్న బకాయిలపై సమీక్ష నిర్వహించారు. రావాల్సిన మొత్తం బకాయిలో రూ. 4.43 లక్షలు అప్పటికప్పుడు వసూలు చేయించారు. మిగిలిన మొత్తం త్వరలో జమ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 38.37 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు ప్రయోజనం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి
● న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కక్షిదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయనీ, కోర్టు ఫీజు కూడా వాపస్ వస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి జిల్లా పోలీస్ కార్యాలయంలో జరుగుతున్న మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఏపీ హైకోర్టు ఎంపిక చేసిన న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ముగింపు కార్యక్రమానికి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి టి.లీలావతి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పీడీజే వైవీఎస్‌బీజీ పార్థసారథి మాట్లాడుతూ 40 గంటల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినందుకు అందరికీ అభినందనలు తెలిపారు. మధ్యవర్తిత్వం అనేది పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అన్నారు. సమస్య పరిష్కారంలో కక్షిదారులే కీలక పాత్రదారులనీ, మధ్యవర్తిత్వంలో కక్షిదారుల ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఉంటుందన్నారు. తమకు అనుకూలమైన రీతిలో కక్షిదారులు కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కోర్టు ఫీజు వాపస్ ఇస్తారని తెలిపారు. కక్షిదారులు సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చని తెలిపారు. రాజస్థాన్, కేరళ నుంచి శిక్షణ కోసం నియమించిన ఆచార్య అడ్వకేట్ ప్రమీలా, అడ్వకేట్ వి.పి. తంకచన్‌లను న్యాయమూర్తులు సత్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు పాల్గొన్నారు.

8వ ఆర్థిక గణనకు కేంద్రం ఆదేశాలు

● జిల్లా స్థాయి కమిటీల నియామకం
● విధివిధానాల ఖరారు

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాల వారీగా 8వ ఆర్థిక గణనకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఎకనామిక్ సెన్సస్ త్వరలో జరగనుంది. ఆర్థిక గణన సజావుగా జరిగేందుకు వీలుగా పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీలను ప్రభుత్వం నియమించింది. కమిటీకి చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్, సభ్యులుగా మున్సిపల్ కమిషనర్లు, పరిశ్రమలు, ఐ అండ్ పీఆర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఎన్ఎస్ఎస్‌వో నుంచి ఒకరు, ఐటీ నిపుణుడు, జిల్లా ఎస్పీ ఉంటారు. మెంబర్ కన్వీనర్‌గా జిల్లా ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అధికారి వ్యవహరిస్తారు.

దేశ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొనేందుకు..

దేశ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొనేందుకు ఈ ఆర్థిక గణనని కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది. ఎకనామిక్స్ సెన్సస్ సందర్భంగా ఉత్పాదకరంగంలో ఉన్న వ్యవసాయ, వ్యవసాయేతర పరిశ్రమలన్నింటిని లెక్కిస్తారు. తద్వారా పరిశ్రమలు ఎన్ని, వాటిల్లో ఎంతమంది ఉద్యోగ, ఉపాధి పొందుతున్నారు. పెట్టుబడులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, యాజమాన్యం ఎలాంటిది వంటి వివరాలన్ని సేకరిస్తారు. జీడీపీ(గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్) విషయంలో సూక్ష్మ, వికేంద్రీకరణ ప్రణాళిక కోసం ఈ సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుంది.

సాధ్యమైనంత త్వరగా..

తొలి ఎకనామిక్ సెన్సస్‌ని దేశంలో ప్రప్రథమంగా 1977లో నిర్వహించారు. ఆ తర్వాత 1980, 1990, 1998, 2005, 2013లో నిర్వహించి వాటి గణాంకాలను విడుదల చేశారు. చివరిసారిగా ఏడో ఆర్థిక గణన 2019లో ప్రారంభించారు. అయితే కోవిడ్ కారణంగా దాని ఫలితాలను కేంద్రం నేటికీ విడుదల చేయలేకపోయింది. అయితే ఇప్పుడు వాటి గణంకాల వలన ఎలాంటి ఉపయోగం లేకపోవడంతో 8వ ఆర్థిక గణనని ఈ సంవత్సరంలోనే చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గురువారం మూడు (గుంటూరు, పల్నాడు, బాపట్ల) జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు వెలువడ్డాయి. సాధ్యమైనంత త్వరగా కమిటీని నియమించి ఆర్థిక గణనని వేగవంతంగా చేపట్టి ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి కమిటీకి నివేదికలు అందజేయాలని ఆదేశించింది.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతలో నైపుణ్యాల్ని పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. ఇందుకోసమే పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు జిల్లా నైపుణ్యాధికారి కొండా సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ, యువకులు https://pminternship.mca.gov.in/loginఅనే లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పది పాసైన అభ్యర్థులతో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ వంటి డిగ్రీలు పూర్తి చేసిన 21 నుంచి 24 సంవత్సరాలలోపు వారు అర్హులని తెలిపారు. ప్రోగ్రామ్‌కు ఎంపికైన వారికి రూ.6500 వన్ టైమ్ గ్రాంట్, భారత ప్రభుత్వం నుంచి నెలకు రూ. 4500, పరిశ్రమల ద్వారా రూ. 500 సంవత్సరం పాటు అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తారు. ఇంటర్న్‌షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉంది. ఇప్పటికే ఉన్న పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 21 మధ్యలో పైన పేర్కొన్న లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 998853335, 8712655686 నంబర్‌లో సంప్రదించాలని నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు తెలిపారు.

వాటర్ గ్రిడ్ పథకానికి టెండర్

● రూ.1200 కోట్ల వ్యయంతో పనులు
● పథకం అమలుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృషి

నరసరావుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం వాటర్ గ్రిడ్ పథకంను ప్రభుత్వం చేపట్టింది. రూ.1200 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు పథకం నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్ నిర్వహిస్తున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పనులు చేపట్టకుండా పథకాన్ని అటకెక్కించారు. వాటర్ గ్రిడ్ పథకం అమలు కోసం ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు విశేషంగా కృషి చేశారు. టెండర్ ప్రక్రియ ప్రారంభం కావడంతో వాటర్ గ్రిడ్ అమలులో ముందడుగు పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో నాగార్జున సాగర్ నుంచి నీటిని గ్రిడ్ పథకానికి వినియోగిస్తారు. ఈ నీటిని శుద్ధి చేసి పైప్ లైన్‌ల నిర్మాణంతో ఓవర్ ట్యాంక్‌ల ద్వారా గ్రామాలు, పట్టణాలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం అమలులో ఉన్న జలజీవన్ మిషన్, అమృత్ పథకాలకు వాటర్ గ్రిడ్‌ను అనుసంధానం చేస్తారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ జలాన్ని అందించే లక్ష్యంతో వాటర్ గ్రిడ్ పథకాన్ని చేపడుతున్నారు. బోర్లు.. బావుల ద్వారా నీటిని వినియోగిస్తుండటంతో ఫ్లోరైడ్ వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. నది జలాలను అందించడం ద్వారా ఫ్లోరైడ్‌ను పూర్తిగా నిరోధించే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో వాటర్ గ్రిడ్ నిర్మాణం కోసం ఎంపీ జరిపిన చర్యలు సఫలమయ్యాయి. సహరించిన సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదుల ఆందోళన ఉధృతం




జిల్లా కోర్టు వద్ద పోలీసుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న న్యాయవాదులు

గుంటూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పొన్నూరులో న్యాయవాది బేతాళం ప్రకాశరావుపై ఎస్సై చేయి చేసుకున్న వ్యవహారం పోలీస్ వర్సెస్ అడ్వకేట్‌గా మారింది. ఇందుకు బాధ్యులైన పొన్నూరు సీఐ రవికిరణ్, ఎస్ఐ రాజ్‌కుమార్, ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలంటూ న్యాయవాదులు ఆందోళన కొనసాగిస్తున్నారు. వారం రోజులుగా విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్నారు. నాలుగు రోజులుగా జిల్లా కోర్టు మెయిన్ గేటు వద్ద నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. నిరసనలో భాగంగా శుక్రవారం గుంటూరు జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు పొన్నూరు సీఐ, ఎస్ఐల దిష్టిబొమ్మలు దహనం చేశారు. సీఐ, ఎస్ఐలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పొన్నూరు ఎస్ఐని వీఆర్‌కు పంపామని, ఆయనపై కేసు కూడా నమోదు చేశామని పోలీసు అధికారులు అంటున్నారు. సీఐ, కానిస్టేబుళ్లపై కూడా చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు ఆందోళన ఉధృతం చేస్తున్నారు. శుక్రవారం జిల్లా కోర్టు మెయిన్ గేటుకు తాళం వేసి ఎవరూ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. రిమాండ్ ఖైదీలను కోర్టులో హాజరు పర్చేందుకు ఎస్కార్ట్‌గా వచ్చిన పోలీసులు సైతం లోపలికి వెళ్లకుండా న్యాయవాదులు గేట్లకు తాళాలు వేశారు. న్యాయవాదుల నిరసన నేపథ్యంలో విధులకు హాజరు కాలేకపోయామని ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకు పోలీస్ సిబ్బంది న్యాయవాదుల నిరసనను తమ సెల్‌ఫోన్లో వీడియో తీశారు. ఈ క్రమంలో న్యాయవాదులు, పోలీసుల మధ్య వాదోపవాదాలు జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ సమయంలో జిల్లా జడ్జి పార్థసారథి అక్కడకు రావడంతో వివాదం సద్దుమణిగింది. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరవిశంకర్, మాజీ అధ్యక్షుడు శాంత కుమార్, సభ్యులు ఝాన్సీ, క్రాంతి కుమార్, బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ఆనంద్, సొపాటి బాబు, మధిర నాగేశ్వరరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన కొనసాగిస్తాం

బేతాళం ప్రకాశరావును కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు ఆందోళనను ఉధృతం చేస్తామని జిల్లా ఫెడరేషన్ చైర్మన్, జీబీఏ ప్రెసిడెంట్ కాసు వెంకటరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కోర్టు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపైనే పోలీసులు దాడులు చేస్తుంటే ఇక సామాన్య మానవుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. న్యాయవాదిపై దాడి చేసిన పొన్నూరు ఎస్ఐ, సీఐలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి కోరినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఆయన ధ్వజమెత్తారు. శనివారం నుంచి సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టులు బహిష్కరించే విధంగా పిలుపు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా కొంత మంది గిరిజన సంఘాల వారు జిల్లా ఎస్పీని కలిసి ఎస్ఐకు మద్దతు తెలుపుతూ న్యాయవాది బేతాళం ప్రకాశరావుపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది.

గుంటూరు కళాపరిషత్ నాటక సంబరాలు ప్రారంభం



నాటక ప్రదర్శనలను ప్రారంభిస్తున్న ఆలోకం పెద్దబ్బయ్య, నాయుడు గోపి

గుంటూరు(తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో, గుంటూరు కళా పరిషత్ నాటక సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిలుగా గుంటూరు కళా పరిషత్ అధ్యక్షుడు వీవీ మల్లికార్జునరావు, కార్యదర్శి బి.పూర్ణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ యెండ్లూరి సీతారామాంజనేయులు, ప్రముఖ రంగస్థల నటుడు వేముల మోహనరావు, కళాకారుడు, రచయిత షేక్ సైదా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. అనంతరం సిటీ వాకర్స్ అసోసియేషన్, బీఎమ్ రెడ్డి దర్శకత్వం వహించిన గుంటూరు వారి చే 'స్వేచ్ఛ', శ్రీ సాయి ఆర్ట్స్, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించిన కొలకలూరి వారిచే 'జనరల్ బోగీలు', కళానికేతన్ వీరన్నపాలెం వారిచే వై బుచ్చయ్య చౌదరి దర్శకత్వం వహించిన 'బుతువులేని కాలం' నాటికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ గౌరవ సలహాదారు ఆలోకం పెద్దబ్బయ్య, ఉపాధ్యక్షుడు నాయుడు గోపి మాట్లాడుతూ ప్రదర్శనల్లో భాగంగా శనివారం గంగోత్రి, పెదకాకాని వారిచే అష్టమ వసువు(సాంఘిక పద్య నాటకం)ను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

రేపు ఉపకార వేతనాలు పంపిణీ

● 300 మంది విద్యార్థులకు రూ. 50 లక్షలు పంపిణీ



ఆహ్వాన పత్రాలు విడుదల చేస్తున్న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య

గుంటూరు (విద్య) జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఈ నెల 12న కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య తెలిపారు. శుక్రవారం జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ బసవపున్నయ్య మాట్లాడుతూ కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు అమెరికాలో స్థిరపడిన డాక్టర్ జాస్తి వెంకటేశ్వర్లు, డాక్టర్ కొల్లి రాధాకృష్ణమూర్తి, కొడాలి రాజా వీరయ్య, బొప్పన ద్వారకా ప్రసాద్, కెనడాల స్థిరపడిన డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, పుట్టగుంట వేణుగోపాలరావు, గుంటూరుకు చెందిన డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, డాక్టర్ కృష్ణ ప్రసాద్ , డాక్టర్ యడ్లపల్లి లక్ష్మణస్వామి, పారిశ్రామికవేత్తలు కర్నాటి వెంకటేశ్వర్లు నాట్కో ఫార్మా ఆధ్వర్యంలో సొసైటీని ఏర్పాటు చేశామని వివరించారు. ఏటా క్రమం తప్పకుండా ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు వివరించారు. సొసైటీ కోశాధికారి డాక్టర్ పుట్టగుంట వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతిభ, పేదరికం ప్రాతిపదికన విద్యార్థులకు కులాలకు అతీతంగా ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొప్పన ద్వారక ప్రసాద్, డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్, వడ్లమూడి గోవర్ధనరావు, కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ డీన్ నామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 12న కేఎల్‌పీ స్కూల్‌లో జరిగే ఉపకార వేతనాల పంపిణీకి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నాట్కోఫార్మా ఉపాధ్యక్షుడు నన్నపనేని సదాశివరావు తదితరులు హాజరుకానున్నారని నిర్వాహకులు వెల్లడించారు.

ఈపూరు సొసైటీలో రూ.2.20 లక్షలు చోరీ



ఎరువుల గోడౌన్‌లో పరిశీలిస్తున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు

ఈపూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరులోని సొసైటీ భవనంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎరువులు, పురుగు మందులు విక్రయించిన నగదు రూ 2.20 లక్షలు చోరీకి గురైయ్యాయి. గోడౌన్‌కు ఏర్పాటు చేసిన షట్టర్ పైకి లేపి భవనంలోకి ప్రవేశించిన దుండగులు నగదు తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను తీసుకు వెళ్లారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. సీఈవో పోకా కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హిమాలయ అగ్రిటెక్‌పై విజిలెన్స్‌కు ఫిర్యాదు

గుంటూరు సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నకిలీ బయో మందులతో రైతులను నట్టేట ముంచుతున్న హిమాలయ అగ్రిటెక్‌పై జీవీ రావు అనే వ్యక్తి గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. హిమాలయ అగ్రిటెక్ పేరుతో వినుకొండకు చెందిన బాలునాయక్ అనే వ్యక్తి జీ-2 అనుమతి లేకుండానే బయో ఉత్పత్తులు విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుంటూరు రూరల్ మండలంలోని గ్రామాల్లో ఈ వ్యక్తి విక్రయాలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. నకిలీ బయో మందులు అమ్మినందుకు ఈ వ్యక్తిపై వినుకొండలో ఇప్పటికే కేసు నమోదు అయిందని తెలిపారు. అక్కడ నుంచి వచ్చి ఇక్కడ భారీస్థాయిలో అమ్మకాలు జరుపుతున్నట్టు విజిలెన్స్ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నేడు రూ.5.95 లక్షల ఉపకార వేతనాల పంపిణీ



ఎండీ తులసీ యోగీష్ చంద్ర

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, గుంటూరు' వారి ఆధ్వర్యంలో ఉన్నత విద్య అభ్యసిస్తూ చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 115 మంది గుంటూరు జిల్లా పోలీసు సిబ్బంది వారి పిల్లలకు శనివారం రూ. 5.95 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు తులసీ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని పోలీస్ కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ హాజరై వితరణ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై ఆర్డీవో విచారణ

శావల్యాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం రెవెన్యూ కార్యాలయంలో ప్రతి పనికి అర్జీదారుల నుంచి అధికారులు నగదు వసూలు చేస్తున్నారని ఇటీవల వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నరసరావుపేట ఆర్డీవో మధులత స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బాధితులను విచారించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకొంటే తహసీల్దార్ తన వద్ద రూ.1000 తీసుకొని సర్టిఫికెట్ ఇచ్చారని మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన ముంద్రు పేరమ్మ ఆర్డీవోతో చెప్పి ఆవేదన వ్యక్తం చేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపించి తదుపరి చర్యలు తీసుకొంటామని ఆర్డీవో తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 565.50 అడుగులు ఉంది. ఇది 245.34 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,033 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 50,237 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 43,595 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119.127.137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

58,485 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 51,445 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 58,485 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 47,402 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	7200	15000
నెంబరు. 5	8000	14000	నెంబరు.5	8500	8500
273	9000	12000	273	8000	10200
341	7500	15200	341	10000	10000
4884	9500	9500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16000	తేజ	7500	15100
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8500	13200
దేవనూరు డీలక్స్	8000	14000	దేవనూరు డీలక్స్	10000	10000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9000

బాపట్ల వార్తలు

కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు : ఎస్పీ



ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైన జిల్లాలో కోడి పందేలు నిర్వహించినా, వాటి నిర్వాహణకు స్థలాలు, భూము లు ఇచ్చిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషా ర్ డూడి హెచ్చరించారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడు తూ కోడిపందేలు, పేకాట, మట్కానిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు. గతంలో వీటిని నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎక్కడైన అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినవెంటనే సంబంధిత పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి లేదా డయల్ 112కు కాల్ చేసి చెప్పాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సంక్రాంతి సెలవులకు విహారయాత్రలకు వెళ్ళే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

జాతీయ భాష హిందీ : రావూరి

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ భాష 'హిందీ' అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ప్రపంచ హిందీభాషా దినోత్సవం సందర్భంగా శుక్ర వారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. షేక్ జిలానీ మాట్లాడుతూ హిందీ భాష ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని, హిందీ భాష అభ్యున్నతికి మహాత్మాగాంధీ ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం సాహితిభారతి కోశాధికారి ఆదం షఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీ సామ్యూల్, బీ శ్రీరామచంద్రమూర్తి, కే శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పట్టణ సీఐగా రాంబాబు బాధ్యతలు



సీఐ ఆర్.రాంబాబు

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సీఐగా ఆర్.రాం బాబు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్సీఎస్టీ సెల్ సీఐగా పని చేస్తూ బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఆర్ అహ్మద్‌జానీ సెలవుపై వెళ్ళారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రాంబాబు పాతబస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. పరిసరప్రాంత వ్యాపారులను పిలిపించి ట్రాఫిక్ వలన కలిగే ఇబ్బం దులను వివరించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శవ రాజకీయాలను ప్రజలు క్షమించరు : కొల్లా

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : శవరాజకీయాలను ప్రజలు క్షమించరంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి విరుచుకుపడ్డారు. తిరుపతిలో భక్తుల తొక్కిసలాట ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వచ్చిన జగన్, వైసీపీ మూకలతో స్విమ్స్ ఆసుపత్రి ఐసీయూలో ప్రవేశించి 'సీఎం సీఎం' అని నినాదాలు చేయించి సెల్ఫీలు దిగడం ఆయన దిగజారిన రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఒకవైపు కొందరు భక్తులు దుర్మరణం చెంది మరికొందరు క్షతగాత్రులై ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే పరామర్శకు వచ్చి ఆయన తన బృందంతో శవరాజకీయాలు చేయటం సిగ్గుచేటు అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేమూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వేమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి కోడిపర్రు ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టనున్నట్లు గోపి తెలిపారు. బలిజేపల్లి, వరహాపురం, బేతాళపురం, బూతుమల్లి గ్రామాలకు ఆ గ్రామాల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ ఐదు గంటల పాటు సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మరమ్మతులు నిర్వహిస్తారని, రెండు గంటలకు తిరిగి విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

కొల్లూరు సబ్ స్టేషన్ పరిధిలో...

కొల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ కుర్రా సుధాకరబాబు శుక్ర వారం తెలిపారు. కొల్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని కొల్లూరు, బోసునగర్, గాంధీనగర్, క్రాప, రావికంపాడు, తాడిగిరిపాడు, అబ్బనగూడవల్లి, దోనేపూడి, కోటిపల్లి, చినపులివర్రు, గాజుల్లంక, పెసర్లంక, ఆవులవారిపాలెం పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఈపూరులంక సబ్ స్టేషన్ పరిధిలోని సుగ్గునలంక ఫీడర్‌పై సుగ్గునలంక, చిలుమూరులంక, అన్నవరపులంక, కనిగిరి లంక గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అనంత భోగేశ్వరస్వామికి శాంతి కల్యాణం

కొల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వరస్వామి 910వ ప్రతిష్ఠా వార్షిక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామి వారికి 11 ద్రవ్యాలతో మహాన్యాస ఏక రుద్ర వారాభిషేకం, రుద్రహవనం, హారతి, మంత్రపుష్పం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, స్వామివారికి సామూహిక శాంతి కల్యాణం జరిపారు. ఆయా కార్యక్రమాలను కమిటీ సభ్యులు పోతుమర్తి మల్లేశ్వరరావు, జనస్వామి గోపాలకృష్ణమూర్తి, ఈవో నాగిశెట్టి శ్రీనివాసరావు, పార్వతీ అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ సంఘ సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు

● వైభవంగా నగరోత్సవం



శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణ స్వామిని నగరోత్సవం చేస్తున్న అర్చకులు, భక్తులు



రేపల్లెలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనంలో వేణుగోపాలస్వామి



ఉప్పూడి రోడ్డులోని శ్రీవెంకటేశ్వరస్వామిదేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న అనగాని శివప్రసాద్

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ, మండలంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశ పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున 4 గంటలు నుంచి భక్తజనం ఉత్తరద్వార దర్శనం చేసుకొని స్వామివారిని పూజించారు. మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం, సోమేశ్వరస్వామిదేవాలయం,పాండురంగాపురం దేవాలయం, రామాలయం, బెస్తపాలెంలోని కోదండరామాలయం, పాతబస్టాండ్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంతోపాటు పలు దేవాలయాలలో పూజలు జరిగాయి. అనంతరం ఆయా దేవాలయాల దగ్గర నుంచి స్వామివారిని నగరోత్సవం చేశారు. పురవీధులలో వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● రేపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో, పట్టణంలోని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉప్పూడి రోడ్డులోని లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆల యంలో, పాతపట్నంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఉత్తరద్వార దర్శనం ద్వారా స్వామిని దర్శించుకున్నారు. అనగాని శివప్రసాద్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదేవిధంగా రైలుపేటలోని తడవర్తి పట్టాభి రామస్వామి ఆలయం, రామకోటిపేటలోని కోదండ రామాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయంలో, రైలుపేట స్వయంభూ రామలింగేశ్వర స్వామి ఆలయం, చిన్న కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న షిర్డిసాయిబాబా ఆలయం, శారదాంబ ఆలయం, ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు.

● వేమూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విష్ణు ఆలయాలలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. జంపని చెన్నకేశవాలయంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం ధనుర్మాస వ్రత పూజల్లో భాగంగా స్వామికి, గోదా అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. తిరుప్పావై గోష్టి నిర్వహించారు. అనంతరం పల్లకి ఉత్సవం, ఉత్తర ద్వారం వద్ద గోపూజ నిర్వహించారు. ద్వార పూజ నిర్వహించిన అనంతరం భూసహిత చెన్నకేశవ స్వామివారు గరుత్మంతు వాహనంపై భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనం ఇచ్చారు. ఫలప్రదమైన దక్షిణావర్త శంఖం ద్వారా భక్తులకు గోక్షీరాన్ని తీర్థంగా వినియోగించారు. కోనేరు శివాజీ పన్నీరు వేణుగోపాల్, పెరుమాళ్ల వెంకటసుబ్బయ్య, పెరుమాళ్ల రామయ్య దంపతులు ఉత్సవ కార్యక్రమానికి ప్రధాన దాతలుగా వ్యవహరించారు. వేమూరు, చావలి, చదలవాడ, పెరవలి, అబ్బనగూడవల్లి గ్రామాల్లోని విష్ణు ఆలయాలలో వార్షిక ముక్కోటి ఏకాదశి నిర్వహించి గ్రామోత్సవం జరిపారు.

● చుండూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నడిగెడ్డపాలెంలోని చినజీయర్‌స్వామి వాసుదాశ్రమంలో, మున్నంగి వారిపాలెంలోని రామ మందిరంలో కొసనా వాసుదేవ్ బృందం అఖండ హరినామ కీర్తన చేశారు.యడ్లపల్లిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, శ్రీరంగపురంలోని రంగనాథ క్షేత్రం మోదుకూరులో శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనం ద్వారా స్వామిని భక్తులు దర్శించారు.

● పిట్టలవానిపాలెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు వైష్ణవాలయాల్లో శుక్రవారం ఉత్తర ద్వారదర్శనం జరిగింది. అల్లూరు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారదర్శనానికి పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసవర్మ, ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అల్లూరులోని వీధులలో లక్ష్మీనరసింహస్వామివారిని ఘనంగా ఊరేగించారు. మండలంలోని ఖాజీపాలెం కోదండ రామాలయంలో, జీఎస్‌పాలెం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, పిట్టలవానిపాలెం సీతారామస్వామివారి ఆలయంలో, చందోలులోని చెన్నకేశవస్వామి ఆలయంలో, ఖాజీ పాలెంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్తరద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వెల్లటూరు చెన్నకేశవస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించినట్లు ఈవో దీవి వెంకట ప్వాలాచార్యులు తెలిపారు. మండల పరిధిలోని ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానంలో, మండల కేంద్రం కొల్లూరులో వేణుగోపాలస్వామిని భక్తులు తెల్లవారుజామునుంచే ఉత్తర ద్వార దర్శనంలో స్వామిని దర్శించుకున్నారు. నగర సంకీర్తన, గ్రామోత్సవం జరిపారు. అరటి బొత్తల గరుడ వాహనంపై ఏర్పాటు చేసిన స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

● నగరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నగరం శ్రీగిరిపురంలోని లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం, ధూళిపూడిలోని రాజగోపాలస్వామి దేవస్థానంలో భక్తులు ఉత్తరద్వార దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. ధూళిపూడిలో గరుడవాహనంలో రుక్మిణీ సత్యభామ రాజగోపాలస్వామిని మేళతాళాలతో ఊరేగించారు. నగరం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● చెరుకుపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడవల్లిలో వేంచేసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తరద్వారదర్శనం కల్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు స్వర్ణ శంఖువుతో ఇచ్చిన తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఆలయ పూజారి బృందావనం ఫణికుమార్ పూజాదికాలు నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఆలయ ఈవో జంజనం సాంబశివరావు పర్యవేక్షించారు.

● అమృతలూరు, జనవరి (ఆంధ్రజ్యోతి)10 : మండల పరిధిలోని మోప ర్రులో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో అభిషేకాలతో పాటు, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు శంఖు తీర్థం, ప్రసాదాలను అందించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. పలు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు.



జంపని చెన్నకేశవాలయంలో ఉత్తర ద్వారంలో వేంచేసిన శ్రీభూ సహిత శ్రీ చెన్నకేశవ స్వామివారు



భట్టిప్రోలు చెన్నకేశవస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం



అల్లూరులోని ఆలయంలో ప్రత్యేక అలంకారంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి

తీరప్రాంత అభివృద్ధి కోసం కృషి : మంత్రి అనగాని



మంత్రిఅనగానిసత్యప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు,కేసన రామకృష్ణ



మంత్రిఅనగానిసత్యప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నిజాంపట్నం టీడీపీ మండల అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్‌యాదవ్



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రేపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తానని రెవెన్యూశాఖామంత్రిఅనగాని సత్యప్రసాద్ అన్నారు. అనగాని పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గం నుంచి వేలాది సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, ప్రజలు శుక్రవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. గజమాలలు వేశారు. కేక్‌కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ గత మూడు పర్యాయాలుగా రేపల్లె నియోజకవర్గంలోని ప్రజలు తనపై నమ్మకంతో తన వెన్నంటే ఉండి అండగా నిలిచి గెలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రేపల్లె నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ నిచ్చారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో కృష్ణా,పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు తాతాఏడుకొండలు, కేసన రామకృష్ణ, పూషడపుకుమారస్వామి ,కొవనాతి రాజశేఖర్,ఓగిబోయినవెంకట్‌యాదవ్,కొలసానిరాము, నర్రా సుబ్బయ్య, మేకా శివరామకృష్ణ,విచారపు వీరయ్య, చింతల సుబ్బారావు, మల్లాది రామకృష్ణ, గోగినేని పట్టాభిరామారావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, మద్రాసు సాంబ శివరావు, పంతాని సాయికుమార్, దేవగిరి రవి, కేసన వాసు, యరగళ్ళ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ధూళిపూడిలో..

నగరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ధూళిపూడి తెలుగ యువత ఆధ్వర్యంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పుట్టినరోజు వేడుకలు ధూళిపూడిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య మాట్లాడుతూ రేపల్లెను మరింత అభివృద్ధి పరిచేందుకు సత్యప్రసాద్ కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నగరం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చింతల సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిరకాల మునిశంకర్,ధూళిపూడి నీటి సంఘం అధ్యక్షుడు వుయ్యూరు భీమేష్‌కుమార్, మాజీ సర్పంచ్ అల్లూరుబిక్షాలు, పాగోలు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగానికి ఎమ్మెల్యే వేగేశన శుభాకాంక్షలు

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శుక్రవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను సత్యప్రసాద్ అలంకరించాలని, జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ప్రజల సౌలభ్యం కోసం గ్రామ సచివాలయం ఏర్పాటు



భట్టిప్రోలులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సౌలభ్యం కోసం మరో నూతన గ్రామ సచివాలయం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. స్థానిక రథం సెంటర్‌లో నూతనంగా నిర్మించిన భట్టిప్రోలు-2 గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదు వేలు జనాభా కలిగిన ప్రతి ప్రాంతానికి ఒక సచివాలయం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మేజర్ గ్రామ పంచాయితీల్లో రెండు సచివాలయాలు ఉంటే ప్రజా సమస్యల పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉంటారని, గత ప్రభుత్వంలో రైతులు పండించిన పంటను అమ్ముకుని సక్రమంగా నగదు పొందలేకపోయారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయాలు చేసిన రైతులకు రెండో రోజునే పూర్తి పైకం వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌కు కూలిపోయిన సర్‌ప్లస్‌ను ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పునః నిర్మాణం చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌వీ రమణ, సర్పంచ్ దారా రవికిరణ్మయి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, పార్టీ నాయకులు యడ్ల జయశీలరావు, వీ.ఆనంద్, జీ.భావన్నారాయణ, బీ.అర్జునరావు, వై.పాండు రంగారావు, పీ.పున్నారావు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయాలను పరిశీలించిన ఎంపీడీవో



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెం, కర్లపాలెం, పాతనందాయపాలెం గ్రామ సచివాలయాలను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని పరిశీలించారు. గ్రామాల్లో జరగుతున్న సర్వేలు 70 నుంచి 80 శాతం పూర్తయినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పూరిళ్లు దగ్ధం

వేమూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి గ్రామంలో శుక్రవారం రాత్రి విద్యు దాఘాతంతో పూరిల్లు దగ్ధమైంది. నల్లబ్రోలు వాసుకు చెందిన పూరింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. తెనాలి అగ్నిపమాక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వీఆర్వో కల్యాణి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్‌కు వీఆర్వో నివేదిక పంపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జమ్ములపాలెం రోడ్డులో ఆర్‌వోబీపై బైక్ అదుపు తప్పి ఫుట్‌పాత్‌ను ఢీ కొట్టింది. బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడం వల్ల టర్నింగ్‌లో అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరిని '108' అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఎత్తిపోతల నిర్మాణ పనులు పూర్తి చేయండి

● ఎమ్మెల్యే ఆనందబాబుకు నాలుగు గ్రామాల రైతుల వినతి

వేమూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు మండలంలో ని తాడిగిరిపాడు వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణపు పనులు పూర్తి చేయించాలని నాలుగు గ్రామాల రైతులు కోరారు. తాడిగిరిపాడు, పెనుమర్రు, అబ్బనగూడవల్లి, చిన పులివర్రు గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే ఆనందబాబును గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయనను కలిశారు. ఎత్తిపోతల పథకం ఏర్పాటు కాకపోతే పరిధిలోని గ్రామాల రైతులు సకాలంలో సాగునీరు అందక ఏటా నష్టాన్ని చవి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ, 2018లో స్వయంగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి ఈ పథకం ఏర్పాటుకు నిధులు కేటాయింపు కోసం తాను ఎంతో కష్టపడిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వైసీపీ హయాంలో ఈ ఎత్తిపోతల పథకాన్ని నాటి ఎమ్మెల్యే విస్మరించడం బాధాకరమన్నారు. తిరిగి ఈ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించేందుకు, దీనిని పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు.



ఎమ్మెల్యే ఆనందబాబును కలిసిన ఐదు గ్రామాల రైతులు

ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను పటిష్ఠం చేయండి : ఏపీటీఎఫ్



సదస్సులో మాట్లాడుతున్న చెన్నుపాటి మంజుల

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నుపాటి మంజుల తెలిపారు. పట్టణంలోని సూర్యకాళీఫంక్షన్ ప్లాజాలో శుక్రవారం నూతలపాటి పరమేశ్వరరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా విద్యాసదస్సు నిర్వహించారు. సదస్సుకు జిల్లా అధ్యక్షుడు ఎ.శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీటీఎఫ్ కోసం పరమేశ్వరరావు నిరంతరం శ్రమించారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ మహాసభల నిర్వాహణ, ఉపాధ్యాయ పత్రికను నిరాటంకంగా వెలువరించటం, డైరీలు, జీవోల పుస్తకాలు ప్రచరణతో పరమేశ్వరరావు నిరంతర పరిరక్షణ ఉపాధ్యాయ ఉద్య మానికి ఎంతగానో దోహదపడిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా మాట్లాడుతూ ప్రగతిశీల భావాలతో విద్యారంగప్రగతికి ఉపాధ్యాయ సంక్షేమానికి ఏపీటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఉపాధ్యాయ ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో ఎపిటిఎఫ్ కీలకశక్తిగా పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ స్థితిగతులు-ఏపీటీఎఫ్ దృక్పథం అనే అంశంపై పలువురు వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో కె.బసవలింగారావు, ఎం.పద్మావతి, ఎండి.ఖాలీద్, వివి రవికుమార్, డి.శ్రీనివాసులు, వై.నేతాంజనేయప్రసాద్, ఐ.విజయసారథి, బి.రఘుబాబు, మాడుగుల కిషోర్, నిజాంపట్నం ఎంఈవో ఆర్.శోభాచంద్ పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చిన హామీ అమలు చేయండి : సీపీఐ



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న జల్లి విల్సన్


బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇల్లులేని పేదలకు పట్టణాలలో రెండు సెం ట్లు, గ్రామాల్లో మూడుసెంట్ల ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున కే టా యిం చా లని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు టీడీపీ కూటమి పేదలకు ఇచ్చిన హామీల గురించి ప్రస్తావించారు. ఆ హామీలను ఇప్పుడు వెంటనే అమలు జరపాలని కోరుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విల్సన్ మాట్లాడుతూ పేదల నుంచి సేకరించిన అర్జీలను అధికారులకు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా ధర్నా చేపట్టి నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ మాట్లాడుతూ హామీలు నెరవేర్చే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఇల్లు లేని ప్రతిఒక్కరికీ స్థలం ఇచ్చి పక్కాగృహం మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షాలెంరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, ముత్తిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలను అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. మండల పరిధిలోని బొద్దులూరుపాడు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంబరాల్లో అమృతలూరు ప్రాజెక్టు సీడీపీవో జీ విజయలక్ష్మి పాల్గొన్నారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లోనూ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలు గొబ్బెమ్మ పాటలు పాడారు. కార్యక్రమంలో ఏసీడీపీవో విజయరాణి, సూపర్‌వైజర్ టీ విజయలక్ష్మి, కార్యకర్త నగరాజకుమారి, తల్లులు, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.125 లక్షలు

చుండూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం రూ.125 లక్షల నిధులు కేటాయిస్తూ మండల పరిషత్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జాలాది రూబేను అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద మండూరు ఎస్టీ కాలనీలో రూ.16 లక్షలతో సీసీ రోడ్లు, చినపరిమి, కారుమూరివారిపాలెం, పెదగాదెలవర్రులలో ఒక్కొక్క గ్రామానికి రూ.10 లక్షల వంతున మోదుకూరుకి రూ.20 లక్షలు, అంబేడ్కర్‌నగర్‌కి రూ.20 లక్షలు, తొట్టెంపూడి రూ.15 లక్షలు, కెఎన్‌పల్లికి రూ.10 లక్షలు, దుండిపాలెం రూ.15 లక్షలు, నడిగెడ్డపాలెంకు రూ.15 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఇన్‌చార్జి ఎండీవో కుమారస్వామి, ఏఈ మరియదాసు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఓ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అమ్మకం కోసం ఉంచిన వివిధ రకాల పందెం కోళ్ల

ఆన్‌లైన్‌లో పందెం కోళ్లు





సంక్రాంతి పండుగ వచ్చిందంటే సంప్రదాయ పిండివంటలతోపాటు అందరినీ ఉర్రూతలూగించేవి కోడి పందాలే. గతంలో పల్లెటూర్లకే పరిమితమైన పందాలు ఇప్పుడు సంప్రదాయం పేరుతో పట్టణాల చెంతకూ చేరిపోయాయి. కోడి పందాల కోసమని ప్రత్యేకంగా పెంచుతున్న పందెం కోళ్లు రూ. లక్షలు పలుకుతున్నాయి. ఇప్పటి వరకు ఇదంతా చుట్టపక్కల గ్రామాల్లో తెలిసిన కోళ్ల పెంపకందారుల దగ్గర బేరాలు జరిగిపోతే, మరికొందరు ఇంకో అడుగు ముందుకు వేసి పందెం కోళ్లను ఆన్‌లైన్‌లోపెట్టిమరీ అమ్మేస్తున్నారు. జాతి, సైజును బట్టి రేట్లు పలుకుతుంటే, కొందరు యూట్యూబర్స్ తమ యూట్యూబ్ ఛానల్స్ ద్వారా కోళ్లను చూపించి, రేటు, ఫోన్ నంబర్ పెట్టి అమ్మకాలకు మార్గం చూపుతున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ పందెం కోళ్ల అమ్మకాలు జోరందుకుంటున్నాయి.



ఆన్‌లైన్‌లో, యూట్యూబ్ ఛానల్స్‌లో పందెం కోడి రేట్లు, అడ్రస్, ఫోన్ నంబర్‌లుపెట్టి అమ్మకాలకు సిద్ధం చేసిన పుంజులు




తెనాలి, జనవరి 10, (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య జిల్లా, పాత గోదావరి జిల్లాల్లో వీటి జోరు మూడు బుకింగ్‌లు, ఆరు ఆన్‌లైన్ బేరాల కింద సాగిపోతోంది. ఇదిట్లా ఉంటే, కోడి పందెం వేసేందుకు పుంజు కాలికి కట్టే కత్తులు నుంచి, పదునైన గోరు తరహాలో ఉండే సాధనాలూ ఆన్‌లైన్‌లో అమ్మేస్తున్నారు. జంతు క్రూరత్వ నిరోధచట్టం 1960 వచ్చాక కోడి పందాలపై నిషేదం వచ్చింది. 2015లో భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం దీనిపై నిషేధం కొనసాగింపును సమర్థించింది. అయితే 2018లో మాత్రం కత్తులు, బ్లేడ్‌ల వంటి వాటిని ఉపయోగించకుండా, పందాలు కాయకుండా సంప్రదాయ పద్ధతిలో పందాలు పండుగ పర్వదినాల్లో వేసుకునేందుకు మాత్రం షరతులతో కూడిన అనుమతినిచ్చింది. అయితే దీనిని ఆసరా చేసుకుని పందెం రాయుళ్లు ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా రూ. వేల కోట్ల పందాలకు బరులు సిద్ధం చేస్తూనే వచ్చారు.

ఆన్‌లైన్ సైట్‌లలో పుంజుల అమ్మకాలు..

2019లో పందె వేస్తుండగా చూస్తున్న వ్యక్తికి కోడి కాలికి కట్టిన కత్తి తగిలి చనిపోయిన నేపథ్యంలో పందాలపై నిషేధం విధించాలని బలంగా వినిపించినా, అప్పట్లో వైసీపీ ప్రభుత్వ పెద్దలు రూ. కోట్ల విలువైన పందేలకే విలువివ్వటంతో ఎటువంటి ఆటంకం కలగలేదు. ఇప్పుడు కూడా పందెం కోడి కాలు దువ్వుతూనే ఉంది. దీంతో పందెం కోళ్లకు మంచి గిరాకీనే వచ్చింది. బయటి మార్కెట్‌లో ఒక్కో పందెం కోడి రకాన్ని బట్టి రూ. 20వేల నుంచి రూ. లక్ష వరకు పలుకుతుంటే, ఆన్‌లైన్‌లో మాత్రం రూ. 4వేల నుంచి రూ. 25వేల వరకు పందెంకోళ్ల ధరలు పెట్టటం విశేషం. కాకి, కాకి నెమలి, కాకి డేగ, కోడి నెమలి, సవల, నెమలి కక్కిర, అబ్రాస్, ఎర్రడేగ, నలుపు గౌడు, డేగ, పింగళి, వంటి రకాలను చూపించి రేట్లు ఆన్‌లైన్‌లో పెట్టారు. వాటితోపాటే వారి కోళ్ల ఫారం అడ్రస్, ఫోన్ నంబర్‌లు ఇచ్చేసి, వాటి ఆధారంగా అమ్మకాలు జరిపేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ బేరాలూ పెరిగిపోయాయి.

- వాటి గుణగణాలు, జాతి వివరాలు పెట్టి అమ్మకాలు
- వీటిపై యూట్యూబర్‌ల ప్రత్యేక వీడియో ప్రచారం
- కొన్ని సైట్‌లలోనూ అమ్మకానికి పుంజులు
- పుంజుతో పాటు, కత్తులు, ఆహారం అన్నీ ఆన్‌లైన్‌లోనే..
- తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాల జోరు


పందెం పుంజులకు ప్రత్యేక ఆహారం

ఆన్‌లైన్‌లోనూ పందేలు సంసిద్ధం..

ఇదిట్లా ఉంటే... ఇప్పటి వరకు క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ వంటి క్రీడలపై ఆన్‌లైన్ పందాలకు సిద్ధపడ్డట్టే, కోడి పందాలకూ సిద్ధపడుతున్నారు. కొన్ని ప్రత్యేక సైట్‌లు లైవ్‌లో పందాలు చూపించి వాటిపై పందాలు కాసుకునేలా ఆన్‌లైన్ జూదానికి ఏర్పాట్లు చేయటం కొసమెరుపు. మరోపక్క కోడి పందాల తరహాలో ఆన్‌లైన్‌లో మనమే పందాలు వేసేలా, ఒక కోడిని ఎంపిక చేసుకుని పందానికి దిగే తరహాలో కొన్ని నిషేదిత ఆన్‌లైన్ సైట్లు వీటిని ఏర్పాటు చేయటం గమనార్హం. ఇవికాక కోళ్ల పెంపకం పుస్తకాలు ఎప్పటి నుంచో ఆన్‌లైన్‌లో దొరికేస్తుంటే, కొత్తగా పందెం కోళ్ల పెంపకానికి సంబంధించిన జాగ్రత్తలతోనూ పుస్తకాలు ఆన్‌లైన్‌లోకి వచ్చేశాయి. కుక్కుట శాస్త్రం పేరుతో తెలుగులోనే పుస్తకాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. మొత్తం మీద ఆన్‌లైన్‌లో కోడి పందానికి సంబంధించి ఏది కనిపించినా వదలకుండా ఆసక్తిగా వీక్షకులు ఆదరించటం పండుగ సంప్రదాయ వేడుకలపై, పందాలపై ఉన్న ఆసక్తికి నిదర్శనమే.


బోనులో ఉంచిన కోడిపైకి మరో పుంజును వదిలి పందెం వేస్తున్న చిత్రం


పందెం వేసే కోళ్ల కాలికి కట్టే కత్తులు, పదునైన గోళ్లవంటి సాధనాలు అమ్మకానికి ఆన్‌లైన్‌లో దర్శనం

యూట్యూబ్‌లో పుంజుల సమాచారం..

కోడిని ఇస్తూనే ఏ రోజు ఏ రకం పుంజు పందె గెలుస్తుంది? ఏ రోజు ఏ దిశలో పుంజును పందానికి వదలాలి? గ్రహాలు, రాశులు ఆధారంగా ఏ రకం కోడి పందెం గెలుస్తుందనే సూచనలూ ఆన్‌లైన్‌లో పెట్టేస్తున్నారు. ఇవన్నీ కాకుండా వారఫలాలూ కోళ్లకు వర్తిస్తాయంటూ మరికొన్ని జాగ్రత్తలూ వివరిస్తున్నారని కొనుగోలుదారులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ మూడు రోజులలో భోగి రోజున గౌడ నెమలి, నెమలి రకానికి చెందిన పుంజులు గెలుస్తాయని, 14వ తేదీ మకర సంక్రాంతి రోజున యాసర, కాకిడేగ, కాకి నెమలి వంటి పుంజులు, 15వ తేదీ కనుమ రోజున డేగ, ఎర్రకాకి వంటి రకాలు గెలుస్తాయంటూ నక్షత్ర బలాన్ని బట్టి సూచనలివ్వటం విశేషం. అయితే ఇవన్నీ యూట్యూబ్‌లో దర్శనమిస్తుంటే, పక్షం రోజుల నుంచి వీటిని వీక్షించేవారి సంఖ్యా పెరిగిపోతోంది. పందెం కోడిని పందెంలో అలుపు రాకుండా ఎట్లా ఈత కొట్టించాలి, వాటికి పందానికి సిద్ధంచేసే ముందు ఏ ఆహారం పెట్టాలి? వంటి సూచనలూ ఉచితంగా అందించేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ వ్యాపారానికి మంచి డిమాండ్ పెరిగింది.

గోకులం గగ్గోలు

(5వ పేజీ తరువాయి)

నుంచి ఆరు పశువుల యూనిట్ల షెడ్ల నిర్మాణం చేపట్టారు. చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులను చెల్లించకపోతుండటంతో షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు చాలావరకు నిలిపివేశారు. షెడ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు బిల్లుల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

చెల్లింపులపై స్పష్టత లేదు..

గోకులం షెడ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు పిల్లర్, రూఫ్, ఫ్లోరింగ్, ఫినిషింగ్ దశల్లో నాలుగు విడతలుగా బిల్లులు చెల్లించాలి. లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాకు ఉపాధి పథకం కింద బిల్లులు జమ చేయాలి. పశువుల షెడ్లకు లబ్ధిదారుడు 10 శాతం చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. కోళ్ల, గొర్రెలు, మేకలు పెంపకందారులు వాటా ధనం మొత్తం వ్యయంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం చెల్లించాలి. అయితే నెల రోజులకుపైగా ఉపాధి హామీ పథకం స్లాట్ నుంచి బిల్లులు విడుదల కావడంలేదు. దీంతో లబ్ధిదారులు ఉపాధి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే బిల్లుల చెల్లింపులపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

2018 నుంచి బిల్లుల పెండింగ్

టీడీపీ హయాంలో 2018లో మినీ గోకులం పథకం కింద రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్ల బిల్లులు నేటికీ చెల్లించలేదు. నాలుగు పశువులు ఉంటే రూ.1.5 లక్షలు, ఆరు పశువులకు రూ.1.8 లక్షలను షెడ్ల నిర్మాణాలకు గత టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. దీంతో అప్పట్లో పాడి పోషకులు పెద్దఎత్తున షెడ్లను నిర్మించుకున్నారు. అయితే ఎన్నికలు జరిగి 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో గోకులం షెడ్ల బిల్లులను పక్కనపెట్టేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.50 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బిల్లులు చెల్లించాలని రైతులు పలుమార్లు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో బిల్లులు చెల్లించి తమకు న్యాయం చేస్తుందని రైతులు గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారు.

మిర్చియార్డులో ఢిల్లీ బృందం పర్యటన


మిర్చియార్డులో పర్యటిస్తున్న ఢిల్లీ బృందం

గుంటూరుసిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి అనే నినాదంలో భాగంగా ప్రధాన మంత్రి కార్యాలయంలోని ఓడీఓపీ విభాగంలో పనిచేస్తున్న అధికారుల బృందం శుక్రవారం గుంటూరు మిర్చి యార్డుని సందర్శించారు. డాక్టర్ ఇషదీప్, డాక్టర్ దివ్య బృందం ముందుగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మిర్చి ఫోటో ఎగ్జిబిషన్‌ను పరి శీలించారు. కలెక్టర్ నాగలక్ష్మీతో భేటీ అనంతరం లాం ఉద్యాన వర్సిటీని, అంకిరెడ్డిపాలెంలోని విశ్వసాయి ఫుడ్స్, కోల్డ్‌స్టోరేజ్, గుంటూరు మిర్చియార్డును సందర్శించారు. మిర్చియార్డులో ఈ-నామ్ నిర్వాహణతీరుపై యార్డుకార్యదర్శి వినుకొండ అంజనేయులు, యార్డు ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం కేంద్ర బృందానికి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్, డాక్టర్ సీవీ రమణ, డాక్టర్ సి. శారద పాల్గొన్నారు.

కోట్లు కొల్లగొట్టినా..

చర్యలేవీ ?

(5వ పేజీ తరువాయి)

సీఈఓ ఉద్దేశ పూర్వక జాప్యం ప్రదర్శించినట్లు వెల్లడించింది. చట్టబద్ధమైన విధుల నిర్వహణలో బ్యాంకులోని అన్ని స్థాయిల్లోని అధికారులు విఫలం అయినట్లు నిర్ధారించింది. అక్రమాల ఉప్పు అందినప్పుడే బ్యాంకు ప్రధాన కార్యక్రమంలోని అధికారులు మేల్కొనుంటే ఇంత పెద్ద మోసం జరిగేది కాదని సహకార అధికారులు చెబుతున్నారు.

సీఈఓ మార్పు షురూ !

డీసీసీ వ్యవహారం లో అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈఓ కృష్ణవేణి ని మార్చేందుకు రంగం సిద్ధం అయ్యింది. ఆమె స్థానంలో కొత్త సీఈఓను నియమిస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. నూతన సీఈఓ ను నియమించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇప్పటివరకు జరిగిన బ్యాంకు అక్రమాల్లో అన్ని స్థాయిల అధికారుల పాత్ర ఉందని ప్రాథమిక విచారణలో తేలినట్లు సహకార శాఖ ఉన్నతాధికారి వెల్లడించారు. అందరిపై క్రిమినల్ చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు.

120 రోజుల్లో పూర్తి కానున్న విచారణ

రాష్ట్ర సహకార శాఖ జీడీసీసీ అక్రమాలపై సెక్షన్ 51కింద విచారణకు ఆదేశించింది. చట్టబద్ధత కలిగిన ఈ విచారణ ప్రక్రియ 120 రోజుల్లో ముగియాలి. జిల్లాలోని 42 జీడీసీసీ శాఖల్లో జరిగిన అన్ని రకాల లావాదేవీలపై ఈ విచారణ జరుగుతుంది. స్వల్ప, మధ్య తరహా,దీర్ఘకాలిక రు ణాల మం జూరు, రికవరీ తది తర అంశాల పై లోతుగా వి చారణ జరుపుతారు. రుణాల మం జూరులో ఏ విధమైన నియమ నిబంధనలు పాటించా రు అన్న దానిపై పరిశీలన చేస్తారు. అవిగాక కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉద్యోగ నియామకాలు, బదిలీలు, నకిలీ సర్టిఫికెట్లు తదితర అంశాల పై కూడా విచారణ జరుపుతారు. సెక్షన్ 51 విచారణ పూర్తి అయిన తరువాత తీవ్రమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.



మంత్రి అనగానికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు

ఘనంగా మంత్రి అనగాని జన్మదినోత్సవం

- శుభాకాంక్షలు తెలిపిన నేతలు, ప్రముఖులు

రేపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత అభివృద్ధికోసం కృషి చేస్తానని రెవెన్యూశాఖామంత్రిఅనగాని సత్యప్రసాద్ అన్నారు.శుక్రవారం పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గం నుంచి వేలాది సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని మంత్రి అనగానికి గజమాలలు వేసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి కేక్‌కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణా,పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటి చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, కేసనరామకృష్ణ, పూషడపు కుమారస్వామి, కొపనాతి రాజశేఖర్, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, కొలసాని రాము, నర్రా సుబ్బయ్య, మేకా శివరామకృష్ణ, విచారపు వీరయ్య, చింతల సుబ్బారావు, మల్లాది రామకృష్ణ, గోగినేని పట్టాభి రామారావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, మద్రాసు సాంబశివరావు, పంతాని సాయికుమార్, దేవగిరి రవి, కేసన వాసు, యరగళ్ళ శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి రద్దీ



గంటల తరబడి పడిగాపులు.. బస్సుల్లో సీట్లు కోసం ఎగబడు తున్న ప్రయాణీకులు.. ఇదీ శుక్రవారం ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణీకులు పడిన ప్రయాణ కష్టాలు. సంక్రాంతి పండుగ రద్దీ ఆర్టీసీకి శుక్రవారం నుంచే ప్రారంభమైంది. విద్యా సంస్థలకు ఈనెల 10వ తేదీ నుంచే ప్రకటించటంతో పెద్ద ఎత్తున ప్రయాణీకులు సంక్రాంతి పండుగకు సొంతూళ్ళకు పయనమయ్యారు. అటు గుంటూరు రైల్వే స్టేషన్‌లోనూ ప్రయాణికుల రద్దీ స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా సుదూరం వెళ్లాల్సిన ప్రయాణికులు రిజర్వేషన్ ఖరారు కాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బస్సుల్లో సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణీకులు

గుంటూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ కోసం ఆర్టీసీ అధికారులు సాధారణ సర్వీసులతో పాటు అదనపు సర్వీసులను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్ళిన ప్రయాణీకులు గుంటూరు చేరుకునేందుకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పాటు విశాఖ వంటి దూర ప్రాంతాల నుంచి గుంటూరుకు వచ్చేలా బస్సులను ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా జిల్లా పరిధిలోని ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణీకులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. రద్దీకి అనుగుణంగా బస్సులను సమకూర్చటంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గుంటూరు - తెనాలి, గుంటూరు- విజయవాడ, గుంటూరు - బాపట్ల, చీరాల, గుంటూరు-నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్ళ వంటి ప్రాంతాలకు రద్దీ కనిపించింది. ప్రధానంగా పల్నాడు ప్రాంతం వైపునకు ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవటంతో బస్టాండ్‌లోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది.

సీట్ల కోసం ఎగబడిన ప్రయాణీకులు

పల్నాడు ప్రాంతంలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, మాచర్ల, వినుకొండ వంటి ప్రాంతాలకు ప్రయాణీకుల రద్దీ కనిపించింది. బస్సులు బస్టాండ్‌లోకి రాగానే సీట్ల కోసం ప్రయాణీకులు ఎగబడ్డారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రయాణీకుల రద్దీ ఉన్న రూట్లలో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లోనూ అదే రద్దీ..

గుంటూరు రైల్వేస్టేషన్ రద్దీగా మారింది. ముఖ్యంగా శుక్రవారం సాయంత్రం విజయ వాడ - లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ వచ్చిన సమయంలో వేల మంది ప్రయాణీ కులు ఆ రైలులో బోర్డింగ్ అయ్యారు. అలానే నంద్యాల మార్గంలో బెంగళూరు, హుబ్లీ తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు కూడా కిక్కిరిసిపోయాయి. తిరుపతిలో 10 రోజుల పాటు వైకుంఠద్వారం తెరుచుకొని ఉంటున్నందున చాలామంది ఈ సెలవుల్లో ఆ దేవదేవుడిని దర్శించుకొనేందుకు తిరుపతికి బయలుదేరారు. అలానే ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో కుంభమేళా జరగనుండటంతో అక్కడికి వెళ్లేందుకు చాలామంది విజయవాడ నుంచి టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో బెర్తులు లభ్యం కాని పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లతో పాటు జనసాధారణ రైళ్లను కూడా శుక్రవారం నుంచి నడపడం ప్రారంభించింది. ఇది కొంతమేరకు ప్రయాణీకులకు ఉపశమనం కలిగించింది.


శుక్రవారం సాయంత్రం లింగంపల్లి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకుల రద్దీ దృశ్యం



ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీశైలంలో జరిగిన పూజలలో పాల్గొన్న మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తదితరులు

శ్రీశైలంలో మంత్రి రవికుమార్ పూజలు

అద్దంకి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి పండగ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శ్రీశైలం దేవస్థానంలో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో శుక్రవారం పాల్గొన్నారు. గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి మంత్రి రవికుమార్ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

నేడు మంత్రి పర్యటన వివరాలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు మండలాల్లో శనివారం పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు అద్దంకి మండలం గోవాడ, 11:30కి కలవకూరు, 12 గంటలకు కొరిశపాడు, 12:30 కు అలవలపాడు గ్రామాలలో మంత్రి పర్యటించనున్నారు.



మృతుడి ఫ్లెక్సీతో రోడ్డుపై బైఠాయించిన బంధువులు, దళిత సంఘాల నాయకులు

ఎస్సై విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

● మృతుని కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు

చీరాలటౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఏఆర్ ఎస్సై సంపూర్ణరావు మృతికి కారణమైన దొనకొండ ఎస్సై కె.విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బంధువులు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి పేరాల రహదారిలో మృతుని చిత్రపటంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో సీఐలు శేషగిరిరావు, నాగభూషణం, శ్రీనివాసరావు ఆందోళనకారులతో మాట్లాడారు. ఘటనపై పారదర్శకంగా విచారణ జరుగుతుందని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కోట్లు కొల్లగొట్టినా.. చర్యలేవీ..?

● జీడీసీసీ సీఈఓపై రాష్ట్ర సహకార శాఖ తీవ్రఆరోపణలు

(5వ పేజీ తరువాయి)

సీఈఓ ఉద్దేశ పూర్వక జాప్యం ప్రదర్శించినట్లు వెల్లడించింది. చట్టబద్ధమైన విధుల నిర్వహణలో బ్యాంకులోని అన్ని స్థాయిల్లోని అధికారులు విఫలం అయినట్లు నిర్ధారించింది. అక్రమాల ఉప్పు అందినప్పుడే బ్యాంకు ప్రధాన కార్యక్రమంలోని అధికారులు మేల్కొనుంటే ఇంత పెద్ద మోసం జరిగేది కాదని సహకార అధికారులు చెబుతున్నారు.

సీఈఓ మార్పు షురూ !

డీసీసీ వ్యవహారం లో అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈఓ కృష్ణవేణిని మార్చేందుకు రంగం సిద్ధం అయ్యింది. ఆమె స్థానంలో కొత్త సీఈఓ ను నియమిస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. నూతన సీఈఓ ను నియమించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇప్పటివరకు జరిగిన బ్యాంకు అక్రమాల్లో అన్ని స్థాయిల అధికారుల పాత్ర ఉందని ప్రాథమిక విచారణ లో తేలినట్లు సహకార శాఖ ఉన్నతాధికారి వెల్లడించారు. అందరిపై క్రిమినల్ చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు.

120 రోజుల్లో పూర్తి కానున్న విచారణ

రాష్ట్ర సహకార శాఖ జీడీసీసీ అక్రమాలపై సెక్షన్ 51కింద విచారణకు ఆదేశించింది. చట్టబద్ధత కలిగిన ఈ విచారణ ప్రక్రియ 120 రోజుల్లో ముగియాలి. జిల్లా లోని 42 జీడీసీసీ శాఖల్లో జరిగిన అన్ని రకాల లావాదేవీలపై ఈ విచారణ జరుగుతుంది. స్వల్ప, మధ్య తరహా,దీర్ఘకాలిక రుణాల మం జూరు, రికవరీ తది తర అంశాల పై లోతుగా వి చారణ జరుపుతారు. రుణాల మం జూరులో ఏ విధమైన నియమ నిబంధనలు పాటించా రు అన్న దానిపై పరిశీలన చేస్తారు. అవిగాక కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉద్యోగ నియామకాలు, బదిలీలు, నకిలీ సర్టిఫికెట్లు తదితర అంశాల పై కూడా విచారణ జరుపుతారు. సెక్షన్ 51 విచారణ పూర్తి అయిన తరువాత తీవ్రమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

గోకులం గగ్గోలు

(5వ పేజీ తరువాయి)

నుంచి ఆరు పశువుల యూనిట్ల షెడ్ల నిర్మాణం చేపట్టారు. చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులను చెల్లించకపోతుండటంతో షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు చాలావరకు నిలిపివేశారు. షెడ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు బిల్లుల కోసం కళ్లకాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

చెల్లింపులపై స్పష్టత లేదు..

గోకులం షెడ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు పిల్లర్, రూఫ్, ఫ్లోరింగ్, ఫినిషింగ్ దశల్లో నాలుగు విడతలుగా బిల్లులు చెల్లించాలి. లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాకు ఉపాధి పథకం కింద బిల్లులు జమ చేయాలి. పశువుల షెడ్లకు లబ్ధిదారుడు 10 శాతం చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకందారులు వాటా ధనం మొత్తం వ్యయంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం చెల్లించాలి. అయితే నెల రోజులకుపైగా ఉపాధి హామీ పథకం స్లాట్ నుంచి బిల్లులు విడుదల కావడంలేదు. దీంతో లబ్ధిదారులు ఉపాధి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే బిల్లుల చెల్లింపులపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

2018 నుంచి బిల్లుల పెండింగ్

టీడీపీ హయాంలో 2018లో మినీ గోకులం పథకం కింద రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్ల బిల్లులు నేటికీ చెల్లించలేదు. నాలుగు పశువులు ఉంటే రూ.1.5 లక్షలు, ఆరు పశువులకు రూ.1.8 లక్షలను షెడ్ల నిర్మాణాలకు గత టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. దీంతో అప్పట్లో పాడి పోషకులు పెద్దఎత్తున షెడ్లను నిర్మించుకున్నారు. అయితే ఎన్నికలు జరిగి 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో గోకులం షెడ్ల బిల్లులను పక్కనపెట్టేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.50 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బిల్లులు చెల్లించాలని రైతులు పలుమార్లు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో బిల్లులు చెల్లించి తమకు న్యాయం చేస్తుందని రైతులు గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు

● రైతులు అప్రమత్తంగా ఉండాలి

● దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత రమేష్‌బాబు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత డాక్టర్ జి. రమేష్‌బాబు, తదితరులు

అద్దంకిటౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్ర వేత డాక్టర్ జి. రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నకొత్తపల్లి, కొత్తరెడ్డిపాలెం, శింగరకొండపాలెం గ్రామాలల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతు కత్తెర పురుగు నివారణ కోసం క్లోరిఫైరీపాస్ 50శాతం ఈసీ 500 ఎంఎల్ ఎకరాకు లేదా న్యూవలరాన్ 10శాతం ఈసీ ఎకరాకు 100 ఎంఎల్ మొవ్వులో పడేటట్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. లేత మొక్కజొన్నలో భాస్వరం లోపం కనిపిస్తున్నదని, దీని నివారణకు 19.19.19 పాకెట్స్ 1 కేజీ ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. భాస్వరం లోపం ఉన్న మొక్కల ఆకులు లేత వంకాయ రంగులో కనిపిస్తాయని, చలి వాతావరణం ఉన్నప్పుడు ఈ లోపం కనిపిస్తుందన్నారు. వారి వెంట డీఆర్‌సీ వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నకుమారి, బాపట్ల శాస్త్రవేత ఉషా, అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె. ధనరాజ్, మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణలు ఉన్నారు.



దైవాలరావూరులో శనగ పంటను పరిశీలిస్తున్న సైంటిస్ట్ డాక్టర్ జి. రమేష్‌బాబు,ఏడీఏ కె.ధనరాజ్‌లు

పంట మార్పిడి అవసరం

మేదరమెట్ల :శనగ పంటలో ఎండు తెగులును పంట మార్పిడేతోనే అరికట్టవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ జి. రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని దైవాలరావూరు, బొల్లవరప్పాడు గ్రామాల్లో ఎండు తెగులు సోకిన శనగ పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఎండు తెలుగు సోకిన పంటకు బావిస్టన్ ఎకరానికి 250 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. శాఫ్ ఎకరానికి అరకేజి పిచికారీ చేయాలన్నారు. తెలుగు సోకిన మొక్కలను పీకి దూరంగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కె. ధనరాజ్, ఏవో శ్రీనివాసరావు, వీఏవో ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

శనగ, మొక్కజొన్న పంటల పరిశీలన

మార్టూరు : బొల్లాపల్లి గ్రామంలోని శనగ, మొక్కజొన్న పంటలను బాపట్లలోని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటరు ఎం. ఉష, జిల్లా శిక్షణా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు టి. రత్నకుమారిలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శనగ పంటలో వచ్చే తెగుళ్లు, మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజిరెడ్డి, విస్తరణ అధికారి మౌలాలి, రైతు సంఘం నాయకులు వీరవల్లి కృష్ణమూర్తి, ఇందుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి



సోపిరాలలో గోకులంను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆత్మారావు, వీరయ్య

చినగంజాం, జనవరి 10(ఆంధ్రజ్యోతి) :పశు పోషకులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావులు అన్నారు. మండలంలోని చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల, పూలవారిపాలెం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డులను శుక్రవారం వారు ప్రారంభించారు. పాడి పరిశ్రమకు చేయూతను ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ ఉప సర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, ఏపీవో జె.లక్ష్మీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు పి.రాజశేఖర్, ఎస్.సుదర్శన్, ఎల్.ఏ.ప్రసన్న, కే.మారుతి, ఫీల్డ్ అసిస్టెంట్ బడుగు రమేష్, టీడీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్ కలాం అజాద్, సందు శ్రీనివాసరావు, ధర్మవరపు ఏసు నారాయణ, నరహరి శ్రీనివాసరావు, ఎం.పద్మావతి, షేక్.జిలాని, గంటా వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నక్కబొక్కలపాడులో గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

ఇంకొల్లులో ప్రారంభం

ఇంకొల్లు : మండలంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన పశువుల షెడ్లను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసరావు ప్రారంభించారు. మండలంలో గంగవరం, సూదివారిపాలెం, ఇడుపులపాడు,నక్కలపాలెం గ్రామాలలో మొత్తం 10 పశువుల షెడ్లను ఈ నిధులతో నిర్మించామని ఏపీఎం రేణుక తెలిపారు. వీటిని పశుపోషకులు సక్రమంగా సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ స్థాయి నాయకులు పేర్ని బాపయ్య, కోట కృష్ణారావు, చక్రవర్తి, కరి వీరాంజనేయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోకులం షెడ్‌లతో పాడి పరిశ్రమ వృద్ధి

బల్లికురవ : ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపట్టిన గోకులం షెడ్లతో గ్రామాలలో పాడి పరిశ్రమ వృద్ధి చెందుతుందని ఎంపీడీవో కె. కుసుమకుమారి పేర్కొన్నారు. మండలంలోని నక్కబొక్కలపాడు, బల్లికురవ గ్రామాలలో నూతనంగా నిర్మాణం పూర్తి అయిన గోకులం షెడ్‌లను ఎంపీడీవో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు అన్ని గ్రామాలలో రైతులకు ఉపయెగ పడేలా సబ్సిడీపై గోకులం షెడ్లు మంజూరు చేశామని తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు గ్రామాలలో ఎక్కువ మంది గోకులం షెడ్ల కోసం దరఖాస్తులు చేసి ఉన్నారని వారికి రానున్న రోజుల్లో ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రమాదేవి, సర్పంచ్ దూళిపాళ్ల బుల్లిరామయ్య, ఉపాధి హామీ పథక సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిషేధిత జాబితాలో భూములు రైతులకు చెందేలా చర్యలు

ఎమ్మెల్యే విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్


మద్దిపాడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నిషేధ జాబితాలో అన్యాయంగా ఉ న్న భూములు రైతులకు చెందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బీ ఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కొలచనకోటలో జరిగిన గ్రా మసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలో రీసర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, నిషిద్ధ జాబితాలో ఉన్న వివాదాస్పద భూములపై ప్రభుత్వ న్యాయపరమైన సలహా లు తీసుకుని సంబంధిత రైతులకు అన్ని విధాల న్యాయం జరిగేలా చూడా లని చెప్పారు. వైసీపీ హయాంలో భూ యజమానులను ఇబ్బంది పెట్టి జగన్ బొమ్మలతో హద్దురాళ్లు వేశారని, వాటిని నిషిద్ధ జాబితాలో చేర్చారని ఆయన చెప్పారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఎంపిక చేసిన గ్రామంలో భూ ములు రీ సర్వే చేస్తారనాన్నరు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఎంపీటీసీ అద్దేపల్లి దుర్గాభవాని, క్లస్టర్ ఇన్‌చార్జి దే వబత్తిన ప్రసాద్, తహసీల్దార్ సృజనకుమార్, ఆర్ఐ రమణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు రమణారావు, మోపర్తి లాల్ బహదూర్ పాల్గొన్నారు.

దేవస్థాన విశ్రాంత భవనం ప్రారంభం

వల్లవరంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించా రు. ముక్కోటి ఏకాదశి రోజున ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. అ నంతరం స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండవ జయంత్ బాబు, మార్నేని రాఘవరావు, వరహాలచౌదరి, వడ్లమూడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ వీరాంజనేయులు, మార్నేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

ఒంగోలు(కల్చరల్), జనవరి 10(ఆంధ్రజ్యోతి): హజరత్ సయ్యద్ గొరె మ స్తాన్ అవులియా 46వ గంధ మహోత్సవం శుక్రవారం రాత్రి ఒంగోలులోని మస్తాన్ దర్గా జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హా జరయ్యారు. స్థానిక గోపాల్‌నగరం 1వ లైనులోని పూరిమిట్ల కృష్ణ ఇంటి నుంచి పూల పల్లకి మీద గంధ మహోత్సవం ఊరేగింపుగా దర్గా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గంధ మ హోత్సవంలో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు అఖండ దీపారాధన, రాత్రి 10 గంటలకు మిలాదే షరీఫ్, 12వ తేదీన 8 గంటలకు తహలీల్ ఫాతెహా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వా హకుడు పూరిమిట్ల హజరత్‌బాబా తెలిపారు.



పున్నయ్యచౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిస్వార్థ నాయకుడు పున్నయ్యచౌదరి

మద్దిపాడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ రాజకీయ నాయకుడు మోపర్తి పున్నయ్యచౌదరి అని వైసీపీ మండలాధ్యక్షుడు మండవ అప్పా రావు పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయం సమీపంలో మోపర్తి పున్నయ్య చౌదరి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా ని ర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ 30 సంవత్సరాలు మద్దిపాడు సమితి ప్రెసిడెంట్‌గా పున్నయ్యచౌదరి నిస్వార్థ సేవలు అందిం చారన్నారు. సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి మాట్లాడుతూ బడుగుల జీవనోపాధి కోసం పున్నయ్యచౌదరి ప్రభుత్వ ఉ ద్యోగాలు ఇప్పించారన్నారు. కార్యక్రమంలో మోపర్తి సందీప్, సిద్ధార్థ, డొక్కా కాసిం, గంగిశెట్టి నరసింహారావు, పర్వత

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు సూచించారు. ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫార్మాసిస్టుల సమస్యలను పరిష్కరించేందు కు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం అసోసియేషన్ క్యాలెం డర్‌ను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లును అసోసియేషన్ నా యకులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జె.రవికిరణ్, కె.రత్నాకర్‌బాబు, పి.సూర్యప్రగతి, వెంకట్రావు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించండి

- డీఎస్పీ ఎండి మొయిన్



చీరాల డీఎస్పీ ఎండి మొయిన్

చీరాలటౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతిని పురస్కరించుకుని వాహనదారుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు, వాహన దారులు జాగ్రత్తలు పాటించాలని చీరాల డీఎస్పీ ఎండి మొయిన్ అన్నారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని డీఎస్పీ స్పందించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ టేక్ చేయకుండా పరిమితితోనే వాహనాలు నడపాలన్నారు. అలాగే సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి, ట్రిబుల్ రైడింగ్ చేయరాదని హెచ్చరించారు. కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మేదరమెట్ల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటర్ వైహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న తెలిపారు. శుక్రవారం రాత్రి జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను టోల్ గేట్ మేనేజర్ గిరిబాబు, మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై కుటుంబంతో వెళ్లరాదన్నారు. కారు నడిపే వారు ఖచ్చితంగా సీటు బెల్టు ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయరాదని సూచించారు. రాత్రి వేళల్లో మంచు అధికంగా కురుస్తున్నందున తక్కువ వేగంతో వెళ్లాలన్నారు. రోడ్డు మార్జిన్‌లో ఎక్కడా వాహనాలు నిలపరాద అన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు దాటే వ్యక్తులు, ద్విచక్రవాహనదారులు వెనుక వచ్చే వాహనాలను గమనించి రోడ్డు దాటాలన్నారు. పండుగలకు కుటుంబాలతో వెళ్లేవారు నిబంధనలు పాటించి గమ్యం చేరాలని ఆమె కోరారు.



నేతన్నల సమస్యలు తెలుసుకుంటున్న కూటమి నాయకులు

సమస్యలు చెప్పుకుందాం.. పరిష్కరించుకుందాం..

● గ్రామనడకలో కూటమి నేతలు

వేటపాలెం(చీరాల), జనవరి 10(ఆంధ్రజ్యోతి) : మన సమస్యలను చెప్పుకుందాం.. పరిష్కరించుకుందాం.. అందుకు ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌లు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తారని కూటమి నేతలు పేర్కొన్నారు. మండల పరిధిలోని పందిళ్లపల్లిలో శుక్రవారం గ్రామనడక పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులనుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పి. బాలచంద్ర, ఆర్‌కె నాయుడు, పి. శ్రీనివాసరావు, సాయి, లింగమూర్తి, లోకేష్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఏలూరి, ఆయన తనయుడు దివ్వేష్

మంత్రి జన్మదిన వేడుకల్లో ఏలూరి

పర్చూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ జన్మదిన వేడుకల్లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఆయన తనయుడు దివ్వేష్ పాల్గొని విజయవాడలోని మంత్రి నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అనగాని దివ్వేష్‌ను అప్యాయంగా పలుకరించి అభిమానం చాటుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరితోపాటు, పర్చూరు నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు అనగానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



బాధిత యువకుడికి సాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

బాధిత యువకుడికి సాయం

మార్టూరు,జనవరి10 (ఆంధ్రజ్యోతి):స్థానిక గొట్టిపాటి నగర్‌లో నివాసం ఉంటూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పఠాన్ జబ్బార్ అనే యువకుడికి శుక్రవారం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు 20 వేల రూపాయల నగదుతో పాటు బియ్యాన్ని అందజేశారు. హెల్పింగ్‌హాండ్స్ సంస్థకు చెందిన పఠాన్ ఖాదర్‌వలి,పఠాన్ సలీం, ఎస్‌కెబాషా, రహీం, ఎస్‌కె ఖలేషా, విజయసాయికుమార్ తదితరులు కలిసి సాయం అందించారు.

వృద్ధులకు అన్నదానం

స్థానిక వెంకయ్య ఆశ్రమంలో శుక్రవారం గర్నెపూడి భావన్నారాయణ గాయత్రి దంపతులు తమ కుమార్తె, కుమారుడు జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

నేడు పోలీసు ఔట్‌పోస్టు ప్రారంభం

ఇంకొల్లు,జనవరి 9,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు స్థూపం సెంటర్‌లో రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసు ఔట్‌పోస్టును శనివారం ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా పర్చూ రు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు,రోటరీక్లబ్ 3,150 గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి, బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి హాజరుకానున్నట్లు రోటరీ ప్రతినిధులు తెలిపారు.

అవీ..ఇవీ


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు

అర్హులైన పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలి

● సీపీఐ, ఏఐటీయూసీ డిమాండ్

చీరాల, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలతో పాటు గృహాలు నిర్మించాలని కోరుతూ సీపీఐ, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ముందుగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరారు. అక్కడ తమ డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీఐటీయూ బాధ్యులు బత్తుల శామ్యూల్, మేడ వెంకట్రావు, ఏ. బాబూరావు, ప్రకాష్, సైదయ్య, దుర్గాప్రసాద్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలలో పాల్గొన్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు

అద్దంకిటౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు రి లే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకులు డి. గంగాధర్ ప్రారంభించారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, కార్మికులు ఆందోళన, పోరాటాలకు తమ సంఘం పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ విభాగం కార్మికులు పది మంది రి లే దీక్షలు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, అద్దంకి మున్సిపల్ వర్కర్స్ కార్యదర్శి జి. బీష్మా , అలివేలమ్మ, ఇంజనీరింగ్ విభాగం నాయకులు శామ్యూలు, వి.జాన్ కె. మారుతి, డి. జాషువా, మార్కు, లక్ష్మీనారాయణ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శక్తి ఆరాధన కొలుపు మహోత్సవం

పంగులూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవం మూడవరోజు శుక్రవారం వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి అలంకరణ చేపట్టి గౌరీ దేవత కలశము, మల్లన్న , త్రిశక్తి స్వరూపిణితో గణాచారి గ్రామోత్సవం చేపట్టారు. గ్రామంలోని ప్రజలందరూ క్షేమంగా ఉండాలని, పాడి పంటలతో శోభిల్లాలని కోరుతూ ఉమా మూలమంత్రం జపిస్తూ కళ్లు మూసుకుని పురవీధులలో గ్రామోత్సవం చేస్తూ అమ్మవారిని పుర ప్రవేశం గావించారు. వేదమూర్తివర్యులు చల్లా సత్యనారాణశాస్త్రి, పలువురు వేద పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అభిముఖంగా పూలు, తమలపాకులు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకుంటూ భక్తిని చాటారు.

సీసీ రోడ్ల పర్సంటేజీల్లో తగ్గేదేలే

కొన్నిచోట్ల ముందుగానే వసూళ్లు

ఉన్నతాధికారులకు భాగం

స్థానిక అధికారులకు బిల్లులు వచ్చాక..

ఆందోళన చెందుతున్న టీడీపీ నేతలు

జీఎస్టీ, సీనరేజ్ పోను పనులు జరిగేది

75 శాతం నిధులకే

జమలో ఆలస్యంతో ఆందోళన



బల్లికురవ మండలంలో వేసిన సీసీ రోడ్డు (ఇన్‌సెట్లో) అద్దంకి మండలంలో వేసిన సీసీ రోడ్డు

అద్దంకి/బల్లికురవ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ నిధులతో గ్రామాలలో వేస్తున్న సీసీ రోడ్లు పదికాలాల పాటు గుర్తుండేలా నాణ్యతగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలు సందర్భాలలో అన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో అధికారుల తీరుతో నాణ్యతతో పనులు చేస్తే నేతలు అప్పుల పాలు అయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన చెందుతున్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో పనులు చేసిన నేతలకు మిగిలేది పెద్దగా ఉండదనేది బహిరంగ రహస్యం. అయినప్పటికీ అధికారులు మాత్రం తమకు ఇచ్చే పర్సంటేజీల విషయంలో తగ్గేదేలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అద్దంకి నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు తదితర పనులు జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో 10 నుంచి 20లక్షల రూపాయలకు పైగానే నిధులతో అధికారపార్టీ నేతలు పనులు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. మరి కొన్ని పనులు జరుగుతున్నాయి. ఆయా పనులకు సంబంధించి అధికారులు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రూ.10లక్షల పనులకు సంబంధించి జీఎస్టీ, సీనరేజ్ తదితర పన్నులు పోను రూ.7.20 లక్షలు మాత్రమే పనులు జరుగుతున్నాయి. అందుకు గాను క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు సుమారు 7 నుంచి 10 శాతం పర్సేంటేజీ (మామూళ్లు) రూపంలో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఒక్కో పనికి సంబంధించి రూ.60 వేల నుంచి రూ.70వేలు మామూళ్లు రూపేణా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని పనులు చేస్తున్న అధికార పార్టీ నేతలు పలువురు వాపోతున్నారు. కొన్ని మండలాలలో అధికారులు పనులు ప్రారంభించే ముందే తమకు ఇవ్వాల్సిన మాముళ్లు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. మరి కొంత మంది మాత్రం ఉన్నతాధికారులకు చెల్లించే మామూళ్లు మాత్రం ముందుగా చెల్లించి, అధికారుల మాముళ్లు మాత్రం బిల్లులు జమ అయిన తరువాత తీసుకుంటున్నట్లు సమాచారం. డివిజన్ స్థాయిలో పనులు పర్యవేక్షణ చేసే అధికారి మాత్రం తాను పదవీ విరమణకు దగ్గరలో ఉన్నానని ముందుగానే మరీ ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

ప్రారంభంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు వెంట వెంటనే జమ కాగా, ప్రస్తుతం నాలుగైదు వారాల నుంచి ఆలస్యం అవుతున్నట్లు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అసలే సీసీ రోడ్ల నిర్మాణంలో ఖర్చులు పోను మిగిలేది అంతంత మాత్రమే కాగా, అధికారులకు మాముళ్లు రూపేణా ముందుగానే ఇవ్వాల్సిరావడం, బిల్లులు ఆలస్యం అవుతుండడంతో అప్పులు తెచ్చి చేసిన పనులకు వడ్డీలు కూడా రావని పలువురు ఆందోళన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పనులకు మాముళ్ల గోల నుంచి విముక్తి కల్పించాలని, వెంటనే బిల్లులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు నేతలు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు ● విశేషపూజలు


కాకాణిపాలెం రంగనాయకస్వామి దేవాలయం వద్ద బారులు తీరిఉన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో రంగనాయకస్వామి

అద్దంకి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశిని భక్తులు శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలు దేవాలయాలు భక్తులతో కిట కిటలాడాయి. అద్దంకి పట్టణంలోని కాకాణిపాలెం రంగనాయకస్వామి దేవాలయంలో భక్తులు వేకువ జామునుంచే ఆలయాలలో బారులు తీరారు. అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు రంగనాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి కాకాణిపాలెంలోని మండపం వద్ద ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ప్రదర్శించిన కోలాటం, బృందావన భజన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంతో పాటు అద్దంకి పట్టణంలోని మాధవస్వామి దేవాలయం, కన్యకావరమేశ్వరి దేవాలయం తదితర దేవాలయాలలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మేదరమెట్లలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద బారులు తీరిన భక్తులు


చీరాలలో గరుడ వాహనంపై స్వామి ఊరేగింపు

పంగులూరులో

పంగులూరు : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా అవదూతేంద్ర భక్త సమాజం రామనామం జపిస్తూ సప్తాహం చేపట్టారు.

బల్లికురవలో..

బల్లికురవ :మండలంలోని కొణిదెన గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి దేవాలయంలో అర్చక స్వామి అయినవోలు శోభనాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గుంటుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, వైదన, కొప్పెరపాడు, చెన్నుపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం గ్రామాల పరిధిలో ఉన్న దేవాలయాలలో హరే రామ సంకీర్తనంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

మేదరమెట్లలో

మేదరమెట్ల : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మేదరమెట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు క్యూలో నిలబడి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

చీరాలలో

చీరాలటౌన్ : పట్టణంలోని వీర రాఘవ స్వామి దేవస్థానం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్వామి ఊరేగింపు జరిగింది. ఉత్తర ద్వార దర్శనం అనంతరం నగరోత్సవం నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

పర్చూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైష్ణవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేకువ జామునుంచే పెద్ద ఎత్తున భక్తులు స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలోని పురాతన శ్రీవేంకటేశ్వర ఆలయంలోని స్వామివార్లను పర్చూరు కోర్టు న్యాయాధికారులు శాంతి, ప్రశాంతి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్చూరు గంగా పార్వతి, సమేత భీమేశ్వర స్వామివార్ల ఆలయంలో పూజాకార్యక్రమాల అనంతరం స్వామివార్ల గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. అదేవిధంగా శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళా భక్తుల సారథ్యంలో 101 కలశాలతో గ్రామోత్సవం చేపట్టారు. అలాగే మండలంలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామివారి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు గ్రామోత్సం నిర్వహించారు.


మార్టూరులో చెన్నకేశవస్వామిని ఉత్తరద్వారం ద్వారా పూజలు చేస్తున్న భక్తులు

మార్టూరులో..

మార్టూరు : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామిని ఉత్తరద్వారం ద్వారా భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. దేవస్థానం ఆవరణలో ఉన్న ఆంజనేయ స్వామి రాతి ముఖ మండపం వద్ద కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఇసుకదర్శి పాండురంగ స్వామి వారి దేవస్థానంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ద్రోణాదుల గ్రామంలో కోదండ రామస్వామిని భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకున్నారు.

యద్దనపూడిలో..

యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామంలో శ్రీసీతారామదేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సీతారాముల విగ్రహాలను, వినాయకుని గుడిని ప్రత్యేకంగా అలంకరించారు.

చినగంజాంలో

చినగంజాం :మండల పరిధిలోని గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో వైభవంగా శుక్రవారం నిర్వహించారు. వేకువజాము నుంచే వైష్ణాలయాల్లో దేవతామూర్తులను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పెదగంజాం భూనీల సమేత భావనారాయస్వామి, కడవకుదురు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న చెన్నకేశవ స్వామి, సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామ స్వామి దేవస్థానం, సంతరావూరు లక్ష్మీ చెన్నకేశవ స్వామి, చినగంజాం భూదేవి శ్రీదేవి సమేత భావనారాయణస్వామి ఆలయాలు, నీలాయపాలెం, రాజుబంగారుపాలెం, మూలగానివారిపాలెం, మున్నంవారిపాలెం, చింతగుంపల్లి, గొనసపూడి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పూలమాలలతో, పట్టు వస్త్రాలతో అలకరించి ఉత్తర ముఖం వైపు ఉంచగా భక్తులు ఉత్తరద్వారం ద్వారా దర్శంచుకుని తరించిపోయారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


పర్చూరులో శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తులు


భావనారాయణస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైకుంఠ ఏకాదశి పూజల్లో డాక్టర్ మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాల) : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామును భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు క్యూ కట్టారు. ప్రత్యేకంగా వైష్ణవ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ పాల్గొన్నారు. అర్చకులు ఆయనను శాస్త్రోక్తంగా ఆశీర్వదించారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో డాక్టర్ మహేంద్రనాథ్


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠినచర్యలు

చినగంజాం, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చీరాల ఎగ్జిక్యూటవ్ ఇంజనీర్ కే.జాన్ థామస్ హెచ్చరించారు. మండల పరిధిలోని గ్రామాల్లో చీరాల విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటవ్ ఇంజనీర్ జాన్‌థామస్, విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటవ్ ఇంజనీర్ పీవీఆర్ మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖాధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆ శాఖాధికారులు 32 బృందాలుగా ఏర్పడి 64 మంది సిబ్బందితో వివిధ గ్రామాల్లో విద్యుత్ మీటర్ల నుంచి అక్రమంగా వినియోగం, అదనపు లోడు తదితర వాటిని తనిఖీ చేశారు. విద్యుత్‌ను అక్రమంగా వాడుకుంటున్న 52 మందిపై కేసులు నమోదు చేసి రూ.3,35,000లు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల, వేటపాలెం, పర్చూరు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటవ్ ఇంజనీర్లు బి.హరిప్రసాద్, జె.శ్రీనివాసులు, ఎం.రమేష్, చినగంజాం ఏఈ పడవల ఘననారాయణ, అసిస్టెంట్ అకౌంట్స్ అధికారిణి పరిమళ ఫ్లోరెన్స్, చినగంజాం, పలు మండలాల విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సర్వీస్ ప్రొవైడర్స్ మేళాలో మాట్లాడుతున్న మెప్మా సీఎంఎం కొండయ్య

ఆన్‌లైన్ సేవలతో ఆదాయం

● చీరాలలో సర్వీస్ రిజిస్ట్రేషన్ మేళా

● తొలిరోజు 202 మంది దరఖాస్తులు

చీరాల, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ సేవల ద్వారా గృహ సేవకులు(ప్లంబింగ్, విద్యుత్, గృహోపకరణాలు తదితరాలకు సంబంధించిన మరమ్మతులు చేసేవారు) యాప్ ద్వారా తమకున్న నైపుణ్యంతో ఉన్న ఊరిలో సేవలు అందిస్తూ ఆదాయం పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మెప్మా సీఎంఎం కొండయ్యలు చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో శుక్రవారం నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళా సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కొండయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వీస్ ప్రొవైడర్స్ కోసం కల్పించిన అవకాశాలను వివరించారు. తొలిరోజు 202 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీవోలు అరుణకుమారి, సుబ్బారావు, పట్టణ సమాఖ్య అధ్యక్షులు, రీసోర్స్ పర్సన్లు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత మృతి


సుబ్బయ్య (ఫైల్)

పంగులూరు, మేదరమెట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత వజ్జా సుబ్బయ్య (58) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై శుక్రవారం ఉదయం అద్దంకి వెళ్లి తిరిగి వస్తుండగా 16వ నెంబరు జాతీయ రహదారిపై వెంకటాపురం సమీపంలో చిలకలూరిపేట వైపు వేగంగా వెళుతున్న కృష్ణాజిల్లా విసన్న పేటకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్బయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతల సంతాపం

రోడ్డు ప్రమాదంలో సుబ్బయ్య మరణం పట్ల టీడీపీ నేతలు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు సంతాపం తెలిపారు. సమాచారం తెలుసుకున్న మండల నేతలు గుర్రం ఆదిశేఖర్, షేక్ మస్తాన్‌వలి, బొర్రెడ్డి ఓబుల్‌రెడ్డి, కోమటి ప్రసాద్‌లు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

మేదరమెట్ల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో కొరిశపాడు ప్లై ఓవర్ వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు.కొరిశపాడు గ్రామానికి చెందిన డి. నారాయణ(65) పొగాకు బ్యారన్‌ల వద్ద పనిచేస్తున్నాడు. శుక్రవారం రోడ్డు దాటుతున్న నారాయణను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో ఒంగోలు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మార్టూరులో రెండిళ్లలో చోరీ

● మరో ఇంటిలో సీసీ ఫుటేజీ ధ్వంసం


చిందరవందరగా వేసిన బీరువాలోని దుస్తులు

మార్టూరు,జనవరి10(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం వేకువజామున మార్టూరులోని రామ్‌నగర్‌లో రెండు నివాసగృహాలలో చోరీకి పాల్పడ్డారు. అంతేగాకుండా మరో ఇంటిముందు ఉన్న రెండు సీసీఫుటేజీలను ధ్వంసం చేయడంతో పాటు మరో ఇంటిలో చోరీకి ప్రయత్నించారు. యద్దనపూడి మండలం యనమదల గ్రామ పంచాయతీ కార్యదర్శి రాణి, మార్టూరు విద్యాశాఖలో సీఆర్‌పీగా పనిచేస్తున్న రమేష్ దంపతులు మార్టూరులో రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు.వారు గత నాలుగురోజుల నుంచి రమేష్ స్వగ్రామమైన ద్రోణాదుల గ్రామంలో ఉంటున్నారు. అతని ఇంటి తలుపులకు ఉన్న తాళం పగులగొట్టిన అగంతుకుడు ఇంటిలోకి ప్రవేశించి బీరువా తలుపులు తెరచి అందులోని వస్తువులను చిందరవందరగా మంచంపై వేశారు. అంతేగాకుండా వారి ఇంటి ఎదురుగా ఉన్న మరో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో తలుపులు తెరిచి దొంగతనానికి పాల్పడ్డాడు. అనంతరం షేక్ షారూక్ అనే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్ఐ బాషా పోలీసు సిబ్బందితో కలిసి వచ్చి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.